

Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్




IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 62 | సోమవారం 28 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## 30న సార్ నుండి నిసార్ ఉపగ్రహ ప్రయోగం

**సూళ్లూరుపేట - సూర్యవాస్తవం, జూలై 27**

భారత్ అంతరిక్ష పరిశోధన సంస్థ మరో భారీ రాకెట్ ప్రయోగానికి రంగ సిద్ధం చేస్తుంది. తిరుపతి జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుండి ఈ నెల 30న సాయంత్రం 5 గంటల 40 నిమిషాలకు జివిఎస్ఎల్వి-ఎఫ్ 16 రాకెట్ ద్వారా నిసార్ ఉపగ్రహాన్ని ప్రయోగించడానికి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తుంది. 2392 కిలోల బరువు కలిగిన నిసార్ ఉపగ్రహాన్ని ఇస్రో,నాసా కలిసి సంయుక్తంగా రూపకల్పన చేశారు. ఇది పూర్తిగా వాతావరణ సమాచారం కోసం రూపొందించిన ఉపగ్రహం. అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ నిసార్ ఉపగ్రహం ద్వారా విలువైన వాతావరణం సమాచారం అందుతుంది.

### చోళరాజ్య వారసత్వం

# ఆధునిక భారత్‌కు రోడ్‌మ్యాప్

**- చోళపురం ఆలయాన్ని సందర్శించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ**

**తూత్తుకుడి - సూర్యవాస్తవం, జూలై 27**

చోళరాజ్య వారసత్వం ఆధునిక భారతదేశానికి రోడ్‌మ్యాప్ వంటిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం తమిళనాడు పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ ఆదివారం గంగైకొండ చోళపురం ఆలయాన్ని సందర్శించారు. సంప్రదాయ పంచెకట్టులో మోడీ ఇక్కడకు వచ్చారు. ఆలయ పూజారులు మోడీకి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ తమిళనాడును పరిపాలించిన రాజేంద్ర చోళ 1, అతడి తండ్రి రాజరాజ చోళుల కాలంలోని సైనిక శక్తిని, పరిపాలనా చతురతను ప్రశంసించారు. చోళ చక్రకవర్తులు సాధించిన ఘనతలు స్ఫూర్తిదాయకమని, భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి రోడ్ మ్యాప్‌ను అందిస్తుందని తెలిపారు. వీరిద్దరి విగ్రహాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. చోళుల కాలంలో సాధించిన



ఆర్థిక, సైనిక విజయాలు ఆధునిక భారత్‌కు ప్రేరణ అని తెలిపారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి ఐక్యతకు ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు. రాజేంద్ర చోళ 1 జయంతి సందర్భంగా జరిగిన ఆది తిరువతిరై ఉత్సవ ముగింపు కార్యక్రమంలో మోడీ పాల్గన్నారు. రాజేంద్ర చోళ 1 గౌరవార్థం ఒక స్మారక నాణెం

- మిగతా 2లో..



### చర్చలకు సిద్ధమైన

## థాయిలాండ్, కంబోడియాలు..

**సురిన్ - సూర్యవాస్తవం, జూలై 27**

సరిహద్దు వివాదానికి ముగింపు పలికేందుకు చర్చలకు సిద్ధమైనట్లు థాయిలాండ్, కంబోడియాలు ఆదివారం ప్రకటించాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రయత్నాల మధ్య చర్చలకు ఇరుదేశాలు అంగీక రించినట్లు సమాచారం. ఇరుదేశాల సరిహద్దుల్లో కొనసా గుతున్న కాల్పులు నాలుగవరోజుకి చేరుకున్నాయి. కాల్పుల్లో 33 మంది మరణించగా,

- మిగతా 2లో..

## పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్

**- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

# అత్యంత అనుకూలం


- డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, గ్రీన్ ఎనర్జీలో విస్తృత అవకాశాలు
- సింగపూర్‌లో భారత హై కమిషనర్‌తో భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- సింగపూర్‌లో సీబీఎన్ బ్రాండ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్న హైకమిషనర్ శిల్పక్ ఆంబులే
- ఏపీలో పెట్టుబడులకు సింగపూర్ కంపెనీల ఆసక్తిగా ఉన్నట్టు వెల్లడి

**సింగపూర్- సూర్యవాస్తవం, జూలై 27**

పోర్టులు, గ్రీన్ ఎనర్జీ సహా వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ లో పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. సింగపూర్ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ప్రోగ్రెసివ్ పాలసీలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. సింగపూర్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో అక్కడి భారత హై కమిషనర్ శిల్పక్ ఆంబులేతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

**సీబీఎన్ బ్రాండ్‌కు ప్రత్యేక గుర్తింపు..**

సింగపూర్ ప్రభుత్వంలో, పారిశ్రామిక వేత్తల్లో సీబీఎన్ బ్రాండ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని భారత హై కమిషనర్



ఆంబులే ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిపారు. వివిధ రంగాల్లో సింగపూర్ సాధించిన ప్రగతి, వృద్ధి, ఆ దేశంలో అమలుచేస్తున్న ప్రభుత్వ పాలసీలు, సింగపూర్‌లో భారతీయుల కార్యకలాపాల గురించి భారత హై కమిషనర్ సీఎంకు వివరించారు. ఆరోగ్య రంగం, గ్రీన్ హైడ్రోజన్, ఏవియేషన్, సెమి కండక్టర్స్, పోర్టులు, పారిశ్రామిక రంగాల్లో సింగపూర్ అనుసరిస్తున్న విధానాలపై తెలియజేశారు. భారత్ తో సింగపూర్ ప్రభుత్వం మంచి సంబంధాలను కలిగి ఉందని వివరించారు. భారత్‌లో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు సింగపూర్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని భారత హైకమిషనర్ ఏపీ ముఖ్యమంత్రికి తెలిపారు.

- మిగతా 2లో..



## కర్మభూమిలో ఎదగండి...

## జన్మభూమి కోసం నిలవండి

- సింగపూర్‌లో తెలుగువారికి చంద్రబాబు పిలుపు
- సింగపూర్ లో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు
- తెలుగు డయాస్పోరాతో భారీ కార్యక్రమం
- పెద్ద ఎత్తున హాజరైన తెలుగువారు
- ఉత్సాహంగా ప్రసంగించిన చంద్రబాబు

**సింగపూర్- సూర్యవాస్తవం, జూలై 27**

విదేశాల్లో స్థిరపడి... సంపద సృష్టిస్తున్న తెలుగు వాళ్లు జన్మభూమిని మరిచిపోకూడదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఐదు రోజుల సింగపూర్ పర్యటనలో భాగంగా తొలి రోజున ఆదివారం స్థానికంగా ఉన్న వన్ వరల్డ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో తెలుగు డయాస్పారా ఫ్రం సౌత్ ఈస్ట్ ఏషియా కార్యక్రమంలో పాల్గోన్నారు. ఈ కార్యక్రమానికి సింగపూర్ సహా మలేషియా, థాయ్ ల్యాండ్, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా దేశాల్లో స్థిరపడ్డ తెలుగు ప్రజలు హాజరయ్యారు. సీఎం సభా ప్రాంగణానికి రాగానే సభకు హాజరైన వారంతా లేచి నిలబడి హర్షధ్వానాలు చేశారు. మా తెలుగు తల్లి గీతాలాపనతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆద్యంతం తెలుగుదనం ఉట్టిపడింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రబాబు ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని.. తన సింగపూర్ పర్యటన ఉద్దేశ్యాలను వివరించారు.

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### రాష్ట్ర పునర్నిర్మాణానికి

# కూటమి ప్రభుత్వం కష్టపడుతోంది

- ఐదేళ్లలో ఎంత నష్టం జరిగిందో అంతకు వడ్డీతో కలిపి తీసుకువస్తాం
- సింగపూర్‌లో తెలుగు డయాస్పోరాతో మంత్రి నారా లోకేశ్ సమావేశం
- సింగపూర్‌ను ఆదర్శంగా తీసుకుని కొత్త విధానాలు అమలు చేస్తున్నామని స్పష్టీకరణ

**సింగపూర్ - సూర్యవాస్తవం, జూలై 27**

ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏపీ ఎంతలా నాశనమైందో మీకు తెలుసు... రాష్ట్ర పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఎంత కష్టపడుతోందో మీరంతా చూస్తున్నారు.... చంద్రబాబు గారి పట్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న నమ్మకమే మన పెట్టుబడి...



మన రాష్ట్రంలో ఉన్న అవకాశాలను ప్రచారం చేసి పెట్టుబడులు రాబడదామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. సింగపూర్ ఓవిస్ ఆడిటోరియంలో ఏపీఎన్ఆర్‌టీ ఆధ్వర్యాన నిర్వహించిన తెలుగు డయాస్పోరా సమావేశానికి మంత్రి లోకేశ్ అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఎంత నష్టపోయిందో, అంతకు అంత వడ్డీతో కలిపి తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు.

- మిగతా 2లో..



## 22 మంది వైద్యులు, నర్సులపై విచారణ

**- మంత్రి సత్యకుమార్ ఆదేశం**

**అమరావతి - సూర్యవాస్తవం, జూలై 27**

విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడిన వైద్యులు, నర్సులపై చర్యలు తీసుకునేందుకు శాఖాపరమైన విచారణకు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ ప్రభుత్వాస్పత్రిలో 2020లో జరిగిన అవినీతి నిరోధకశాఖ ఆకస్మిక తనిఖీల్లో అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా వెల్లడైంది. ఆస్పత్రిలో రికార్డులను

- మిగతా 2లో..

## చోళరాజ్య వారసత్వం

# ఆధునిక భారత్‌కు రోడ్‌మ్యాప్

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ ఆర్ ఎన్ రవి, కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్, రాష్ట్ర మంత్రులు తంగం తెన్నరసు, ఎస్ఎస్ శివశంకర్, లోక్‌సభ సభ్యులు తోల్ తిరుమావళనన్ ఇతరులు పాల్గన్నారు. మాల్దీవుల పర్యటన ముగించుకుని ప్రధాని మోడీ శనివారం రాత్రి నేరుగా తమిళనాడులోని తూత్తు కుడికి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. తూత్తుకుడి విమానాశ్రయంలో రూ.450 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అధునీకరించిన కొత్త టెర్మినల్‌ను మోడీ ప్రారం భించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా రూ.4,900 కోట్లతో పూర్తి చేసిన వివిధ రహదారులు, రైల్వే లైన్లను మోడీ జాతికి అంకితం చేశారు.

## చర్చలకు సిద్ధమైన

# థాయిలాండ్, కంబోడియాలు..

(మొదటిపేజీ తరువాయి)

1,68,000 మందికి పైగా నిరాశ్రయులయ్యారు. తాను థాయిలాండ్, కంబోడియా నేతలతో మాట్లాడానని, కాల్పులు కొనసాగితే ఇరుదేశాలతో వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకుంటామని సూచించానని ట్రంప్ తన సోషల్‌మీడియా ట్రూత్‌లో శనివారం పేర్కొన్న సంగతి తెలిసిందే. కాల్పుల విరమణపై చర్చలు జరపడానికి ఇరు దేశాలు అంగీకరించినట్లు పేర్కొన్నారు. తమ దేశం ”తక్షణ మరియు బేషరతుగా కాల్పుల విరమణ”కు అంగీకరించిందని కంబోడియా ప్రధాని హున్‌మానెట్ ఆదివారం ప్రకటించారు. థాయ్ తాత్కాలిక ప్రధాని ఫుమ్తామ్ వెచాయాచారుతో తాను సంభాషించిన తర్వాత థాయిలాండ్ కూడా కాల్పులను నిలిపివేసేందుకు అంగీకరించిందని ట్రంప్ తనతో చెప్పారని అన్నారు. ఇది రెండు దేశాల ప్రజలకు, సైన్యానికి 'సానుకూల వార్త ' అని హున్‌మానెట్ ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా విదేశాంగకార్యదర్శి మార్క్ రూబియోతో తదుపరి చర్చలను సమన్వయం చేయడానికి మరియు కాల్పుల విరమణను అమలు చేయడానికి థాయిలాండ్ విదేశాంగ మంత్రితో నేరుగా చర్చలు జరిపేందుకు తన డిప్యూటీ విదేశాంగ మంత్రి ప్రాక్ సొఖోన్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు. థాయి ప్రభుత్వం మద్దతు ప్రకటించిందని, తాత్కాలిక ప్రధాని ఫుమ్తామ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారని థాయి విదేశాంగ శాఖ తెలిపింది. థాయిలాండ్ సూత్రప్రాయంగా కాల్పుల విరమణకు అంగీకరించిందని, కానీ కంబోడియా నుండి విశ్వాసపాత్రమైన చొరవ అవసరాన్ని ఉద్ఘాటించింది. శాంతియుత పరిష్కారం కోసం అవసరమైన చర్యలను చేపట్టేందుకు త్వరిత ద్వైపాక్షిక చర్చలు జరపాలని ఫుమ్తామ్ పిలుపునిచ్చారని పేర్కొంది. వివాదం ఎలా మొదలైంది : ఇరు దేశాల మధ్య 817 కి.మీ సరిహద్దు ఉంది. ఈ ప్రాంతంలో ఉన్న ప్రీ విహార్, టా మోన్ థామ్ దేవాలయాలు రెండు దేశాలకు చారిత్రకంగా, సాంస్కృతికంగా పవిత్రమైనవి. అయితే సున్నితమైన ఈ ప్రాంతం సరిహద్దు ఘర్షణలకు కేంద్రంగా మారిపోయింది. గత నెలలో కంబోడియా మాజీ ప్రధానితో ఫోన్ సంభాషణల లీక్ కావడంతో షినవత్రా థాయిలాండ్ అధ్యక్ష పదవి కోల్పోయిన సంగతి తెలిసిందే. ఇటీవల మందు పాతర పేలి ఇద్దరు థాయి సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి కంబోడియా కారణమని థాయిలాండ్ ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే రెండు దేశాలు పరస్పరం దాడులకు దిగాయి. తమ దేశాల దౌత్యవేత్తలను తిరిగి పిలిపించాయి. గత రెండు దశాబ్దాల నుండి ఉభయ దేశాల నడుమ సరిహద్దు వివాదం నెలకొని ఉంది.

## కర్మభూమిలో ఎదగండి...

# జన్మభూమి కోసం నిలవండి

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ”ప్రపంచంలో మారుతున్న పరిణామాలను తెలుగు ప్రజలు అందిపుచ్చుకున్నారు. నాడు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలు తెలుగు ప్రజల జీవితాలను మార్చాయి. ప్రపంచవ్యాప్తంగా 120 పైగా దేశాల్లో తెలుగు ప్రజలు స్థిరపడ్డారు. ఏ దేశానికైనా వెళ్లి గట్టిగా తెలుగులో మాట్లాడితే, అక్కడున్న తెలుగు వారు ఓ పది నిమిషాల్లోనే పోగయ్యే పరిస్థితి వచ్చేసింది. ప్రపంచంలోని చాలా దేశాలకు తెలుగు వాళ్లు వెళ్లడమే కాదు.. ఆయా దేశాల్లోని స్థానికులకంటే ఎక్కువగా సంపాదిస్తున్నారు. అమెరికాలో ఉండే స్థానికులకంటే.. తెలుగు వారి తలసరి ఆదాయం చాలా ఎక్కువగా ఉంది. సత్య నాదెళ్ల లాంటి వాళ్లు మైక్రోసాఫ్ట్ లాంటి ప్రముఖ కంపెనీలకు సీఈఓలుగా ఉన్నారు. ప్రపంచంలోని చాలా కంపెనీలకు సేవలు అందిస్తూ... మన తెలుగు వాళ్లు వివిధ దేశాల్లో స్థిరపడ్డారు. సింగపూర్ లో 40 వేల మంది తెలుగు వాళ్లు నివాసం ఉంటున్నారు. తెలుగు వాళ్లు ఏయే దేశాల్లో స్థిర పడ్డారో.. ఆ దేశం వారికి కర్మభూమి... అవకాశాలు కల్పించిన ఆ దేశాభివృద్ధి కోసం పని చేయాలి. అదే సమయంలో పుట్టిన గడ్డను తెలుగు వాళ్లు మరువకూడదు. భారతదేశం... ఆంధ్రప్రదేశ్ వారి జన్మభూమి. ఆ జన్మభూమి అభివృద్ధి కోసం తెలుగు వాళ్లు పనిచేయాలి. పెట్టుబడులు పెట్టాలి. అక్కడి పేదలకు చేయూత అందించాలి. భారతదేశంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలు కట్టిన పన్నులతో మీరు ఈ స్థాయికి ఎదిగారు... ఎన్నో అవకాశాలు పొందారు. కాబట్టి జన్మభూమి అభివృద్ధికి కృషి చేయడం... పెట్టుబడులు పెట్టడం అనేది బాధ్యతగా తీసుకోవాలి. నేను ఏ దేశం వెళ్లినా... అక్కడి తెలుగు వారిని తప్పకుండా కలుస్తాను” అని సీఎం చెప్పారు.

# 22 మంది వైద్యులు, నర్సులపై విచారణ

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి స్థాయిలో పరిశీలించిన ఎసిబి అధికారులు ఇందుకు సంబంధించి పూర్తి నివేదికను ఈ ఏడాది జూన్‌లో సమర్పించగా, దానిని పరిగణనలోకి తీసుకుని అవినీతి, పాలనా వైఫల్యాలు, పర్యవేక్షణ లోపాలు ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇన్‌పేషెంట్లపై తప్పుడు లెక్కలు నమోదు చేసినట్లు, మందుల వినియోగాన్ని నర్సులు సరిగ్గా చూపలేదని తేలిందన్నారు. డిసిహెచ్‌ఎస్‌తోపాటు మరో 9 మంది వైద్యులు, 12 మంది హెడ్ నర్సులపై తక్షణమే విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.

## పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్

# అత్యంత అనుకూలం

(మొదటిపేజీ తరువాయి)

**అమరావతి ప్రాజెక్టులో సింగపూర్..**

గతంలో సింగపూర్‌తో కలిసి అమరావతి ప్రాజెక్టును చేపట్టామని.. కొన్ని కారణాల వల్ల రాజధాని ప్రాజెక్టు నుంచి సింగపూర్ వైదొలిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. 2019-24 మధ్య జరిగిన పరిణామాలు దీనికి కారణమయ్యాయన్నారు. ప్రస్తుతం తన పర్యటనలో గతంలో జరిగిన అపోహల్ని తొలగించి రికార్డులను సరిచేసేందుకు ప్రయత్నిస్తానని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**పెట్టుబడుల కోసం కొత్త పాలసీలు తెచ్చాం..**

వివిధ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఏపీలోని కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త పాలసీలను, అవకాశాలను చంద్రబాబు భారత హై కమిషనర్‌కు వివరించారు. ప్రస్తుతం గ్రీన్ ఎనర్జీ రంగంలో 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటికే విశాఖలో ఎన్టీపీసీ, కాకినాడలోనూ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు పట్టాలెక్కాయని సీఎం వివరించారు. ఇండియా క్వాంటం మిషన్‌లో భాగంగా అమరావతిలో తొలి క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం తెలియజేశారు. విశాఖలో దిగ్గజ ఐటీ కంపెనీ గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని తెలిపారు.

**డిఫెన్స్ సంస్థలకు రాయలసీమ అనుకూలం..**

రాయలసీమలో డిఫెన్సు, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ సంస్థల ఏర్పాటుకు అనువైన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. సింగపూర్ నుంచి భారత్ కు పెట్టుబడులు రావాలని దీనికి ఏపీ గేట్ వేగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలియజేశారు. ఏపీలో పెట్టుబడులకు అవసరమైన సహకారాన్ని అందించాలని హైకమిషనర్ ఆంబులేను సీఎం చంద్రబాబు కోరారు. మరోవైపు సింగపూర్‌లో 83 శాతం మేర పబ్లిక్ హౌసింగ్ ప్రాజెక్టులు ఉన్నాయని భారత హై కమిషనర్ వివరించారు. దీనిపై ఏపీలో చేపడుతున్న హౌసింగ్ ప్రాజెక్టుల గురించి మంత్రి నారాయణ వివరించారు. అలాగే విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, భవిష్యత్ ఆలోచనల్ని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ భారత హై కమిషనర్‌కు వివరించారు. ఏపీలో ఇప్పటికే ఏర్పాటు అవుతున్న ప్రముఖ విద్యా సంస్థల గురించి తెలిపిన మంత్రి ఏపీకి త్వరలో తరలివచ్చే ప్రతిష్టాత్మక విద్యాసంస్థల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని లోకేశ్ స్పష్టం చేశారు.

**ఏపీ టెక్ నిపుణులకు ప్రత్యేక డిమాండ్**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టెక్ నిపుణులకు ఆగ్నేయాసియాలో ప్రత్యేకించి సింగపూర్‌లో డిమాండ్ ఉందని భారత హై కమిషనర్ ఆంబులే సీఎం చంద్రబాబుకు వివరించారు. అమెరికా తరహాలోనే ఆగ్నేసియాలోని సింగపూర్ లాంటి దేశాల విద్యార్థులను, టెక్ నిపుణులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ఈ అంశంపై సింగపూర్‌లోని భారత రాయబార కార్యాలయం ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుందని ముఖ్యమంత్రికి తెలియచేశారు. సింగపూర్ నుంచి ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాల గురించి ఆయన వివరించారు.

**వివిధ రంగాల్లో పెట్టుబడికి అపార అవకాశాలు**

ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల ఉత్పత్తి, షిప్ బిల్డింగ్, పోర్టు కార్యకలాపాల నిర్వహణ, డేటా సెంటర్ల ఏర్పాటు, ఫార్మా తదితర రంగాల్లో సింగపూర్ కంపెనీలు ఏపీలో పెట్టుబడి పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయని సీఎంకు వివరించారు. సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న ఆసియా పసిఫిక్ దిగ్గజ కంపెనీలు ఎస్టీటీ, కెప్పెల్, కాపిటాల్యాండ్, ఈక్వినిక్స్, పీఎస్ఏ తదితర సంస్థల విస్తరణకు అవకాశాలు ఉన్నట్టు వెల్లడించారు. ఏఐ, స్టార్టప్‌లు, వైద్య పరికరాల రంగంలో పరిశోధన, ఏపీ, సింగపూర్ యూనివర్సిటీల మధ్య భాగస్వామ్యం కుదుర్చుకునే అంశంపైనా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, పి.నారాయణ, టీజీ భరత్ తో పాటు ఏపీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పునర్నిర్మాణానికి

# కూటమి ప్రభుత్వం కష్టపడుతోంది

(మొదటిపేజీ తరువాయి)

**తెలుగువారిని ప్రపంచపటంలో నిలిపిన చంద్రబాబు**

తెలుగువారి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ టీడీపీ అని, దానిని నిలబెట్టింది ఎన్టీ రామారావు గారని లోకేశ్ పేర్కొన్నారు. తెలుగువారిని ప్రపంచపటంలో నిలిపింది చంద్రబాబు అని, ఆయనే మన బ్రాండ్ అని అన్నారు. ఐటీ గురించి కొందరు విమర్శించినా, చంద్రబాబు ఇంజినీరింగ్ కళాశాలలను స్థాపించినప్పుడు విమర్శించినా, ఈ రోజు అదే కంప్యూటర్లతో తెలుగువారు ప్రపంచాన్ని శాసిస్తున్నారని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా 30 లక్షల మంది తెలుగు ప్రవాస భారతీయులు ఉండగా, ఫార్ ఈస్ట్‌లో మాత్రమే 3 లక్షల మంది ఉన్నారని, సింగపూర్ సమావేశానికి మలేషియా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, ఇతర ఫార్ ఈస్ట్ దేశాల నుండి పెద్ద ఎత్తున తెలుగువారు తరలిరావడం మన శక్తికి నిదర్శనమని లోకేశ్ వ్యాఖ్యానించారు.

**సీబీఎన్ బ్రాండ్ తో పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాల సృష్టి**

ప్రతి దేశానికి, వస్తువుకు ఒక బ్రాండ్ ఉన్నట్లే, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి అంటే సీబీఎన్ బ్రాండ్ అని లోకేశ్ స్పష్టం చేశారు. ఈ బ్రాండ్‌తో ప్రపంచంలో ఎక్కడికెళ్ళినా పెట్టుబడులు వస్తాయని, రాష్ట్రానికి పెట్టుబడులు సాధించే తమ ప్రయత్నాలకు ఎన్ఆర్ఐల సహకారం అవసరమని కోరారు. సింగపూర్‌ను ఆదర్శంగా తీసుకుని నూతన పారిశ్రామిక విధానాలు అమలు చేస్తున్నామని, వేగంగా వ్యాపారం చేసేందుకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నామని తెలిపారు. దాదాపు 1000 కిలోమీటర్ల తీర ప్రాంతం, పోర్టులు, విమానాశ్రయాలు, హైవేలు, భూములు వంటి అపారమైన వనరులు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయని, ఇది పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా మారనుందని చెప్పారు. టీసీఎస్, కాగ్నిజెంట్, సత్వ, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు ఏపీకి వస్తున్నాయని, ఎస్ఆర్ఎం, విట్, అమృత వంటి విద్యాసంస్థలు వచ్చాయని, బిట్స్ పిలానీ త్వరలో రానుందని వెల్లడించారు.

“20 లక్షల ఉద్యోగాల కల్పన... ఇదే మన నినాదం... ఇదే మన విధానం” అని లోకేశ్ పునరుద్ఘాటించారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన పిలుపుతో జన్మభూమి కార్యక్రమానికి ఎన్నారైలు అండగా నిలిచారని, ఇప్పుడు జీరో పావర్టీ లక్ష్యంగా చంద్రబాబు తలపెట్టిన పీ4 కార్యక్రమంలో ప్రవాసులు భాగస్వాములు కావాలని కోరారు. పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవాలన్నదే చంద్రబాబు గారి కోరిక అని, ఆరోగ్యవంతమైన, సంపన్నవంతమైన, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్ కోసం అందరూ కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. పీ4 లో మార్గదర్శిగా చేరి పేద కుటుంబాలకు ఆసరాగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి, స్కిల్ డెవలప్‌మెంట్**

ఆంధ్రప్రదేశ్‌లో 'డబుల్ ఇంజిన్ సర్కార్' నడుస్తోందని, కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో పనిచేస్తున్నామని లోకేశ్ తెలిపారు. ఐదేళ్లలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని వడ్డీతో సహా తిరిగి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఇతర దేశాల్లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) కంపెనీలను కూడా ప్రోత్సహిస్తామని, ప్రపంచవ్యాప్తంగా 80 శాతం ఉద్యోగాలు ఎంఎస్ఎంఈల ద్వారానే వస్తున్నాయని పేర్కొన్నారు. టీసీఎస్‌లో 35 శాతం తెలుగువారు పనిచేస్తున్నారని, అందుకే ఏపీకి వస్తున్నామని టాటా ఛైర్మన్ చంద్రశేఖరన్ చెప్పారని లోకేశ్ గుర్తు చేశారు.

శాసనసభ్యుల్లో 50 శాతం మంది కొత్తవారు ఉన్నారని, మంత్రివర్గంలో 17 మంది కొత్తవారు ఉన్నారని, అందరూ సహకరిస్తే ఆంధ్రప్రదేశ్‌ను నంబర్ 1గా తయారుచేస్తామని, అభివృద్ధిలో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తామని లోకేశ్ అన్నారు. సింగపూర్‌లో ఇంతమంది తెలుగువారు రావడం తన జీవితంలో మర్చిపోలేని రోజని, ఇక్కడున్న వారిలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే తపన కనిపిస్తోందని ఆయన ప్రశంసించారు. ఏపీఎన్ఆర్టీ 2.0ని ప్రారంభించామని, ఎన్ఆర్ఐలకు ఎటువంటి సమస్యలున్నా ఏపీఎన్ఆర్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చివరగా, పహల్గాం దాడిలో వీరమరణం పొందిన మన రాష్ట్రానికి చెందిన మురళీ నాయక్‌కు నివాళులర్పించాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

## సింగపూర్‌లో చంద్రబాబు..

# భారత హైకమిషనర్ తో భేటీ




- సింగపూర్ లో సీబీఎన్ బ్రాండ్ కు ప్రత్యేక గుర్తింపు
- ఏపీ మంత్రుల బృందంతో హైకమిషనర్ అంబులే వెల్లడి
- విద్యాశాఖలో సంస్కరణలను వివరించిన మంత్రి నారా లోకేశ్

**సింగపూర్– సూర్యవాస్తవం, జూలై 27**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు సింగపూర్ లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం సింగపూర్ లోని షాంగ్రీ–లా హొటల్ వాలీ వింగ్‌లో భారత హైకమిషనర్ డాక్టర్ శిల్పక్ అంబులేతో చంద్రబాబు భేటీ అయ్యారు ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, పి.నారాయణ, టీజీ భరత్‌తో పాటు ఏపీ అధికారులు పాల్గొన్నారు. ఆరోగ్య రంగం, గ్రీన్ హైడ్రోజన్, ఏవియేషన్, సెమి కండక్టర్స్, పోర్టులు, పారిశ్రామిక రంగాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను చంద్రబాబు బృందం శిల్పక్ అంబులేకు వివరించారు. అనంతరం శిల్పక్ అంబులే మాట్లాడుతూ.. భారతదేశంతో సింగపూర్ ప్రభుత్వం సత్సంబంధాలను కలిగి ఉందని అన్నారు. సింగపూర్ ప్రభుత్వంలో, స్థానిక పారిశ్రామిక వర్గాల్లో సీబీఎన్ బ్రాండ్ కు ప్రత్యేక గుర్తింపు ఉందని ఆయన పేర్కొన్నారు. గతంలో సింగపూర్ తో కలిసి అమరావతి ప్రాజెక్టును చేపట్టిన విషయాన్ని గుర్తుచేస్తూ.. కొన్ని కారణాల వల్ల ప్రాజెక్టు నుంచి సింగపూర్ తప్పుకుందని చెప్పారు. ఏపీలో పెట్టుబడులకు సింగపూర్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లా డుతూ.. ఏపీలో కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త పాలసీలను, పెట్టుబడులకు గల అవకాశాలను శిల్పక్ అంబులేకు వివరించారు. గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు ఏపీలో ఇప్పటికే మొదలయ్యాయని చెప్పారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నట్లు చంద్రబాబు వివరించారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో పాటు డిఫెన్స్, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్ సంస్థలకు రాయలసీమ ప్రాంతం అనువుగా ఉంటుందని తెలిపారు. ఏపీలో చేపడుతున్న ప్రాజెక్టుల గురించి మంత్రి నారాయణ, విద్యా రంగంలో ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, తమ ఆలోచనలను మంత్రి నారా లోకేశ్ వివరించారు

## ఇండియా కూటమా...
# ఎన్డీఏ కూటమా...



**విజయవాడ– సూర్య వాస్తవం**

ఐదేళ్లు ఏపీలో అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ.. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇటు అసెంబ్లీ స్థానాల్లో, అటు లోక్‌సభ స్థానాల్లో చిత్తుగా ఓడిపోయింది. ఆ తర్వాత ముగ్గురు రాజ్యసభ సభ్యులు కూడా రాజీనామా చేశారు. దీంతో బలం 7కి పడిపోయింది. లోక్‌సభలో నలుగురు ఎంపీలు ఉన్నారు. ఇక మొన్నటి వరకు వైసీపీ కేంద్రంలో ఎవరికీ అవసరం లేని పార్టీగా మారింది. అయితే మారుతున్న రాజకీయ పరిస్థితులు.. ఇప్పుడు జగన్ ఎటో ఒకవైపు మొగ్గు చూపాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజకీయ త్రాసులో ఉన్న జగన్ ఇప్పుడు ఎటువైపు మొగ్గుచూపుతారన్నది చర్చనీయాంశంగా మారింది. 2019 నుంచి 2024 వరకు జగన్ కేంద్రంలోని ఎన్డీఏ కూటమికి అనుకూలంగా ఉన్నారు. 2022లో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీ ఎన్డీయే అభ్యర్థులకు మద్దతు ఇచ్చింది. అప్పట్లో వైసీపీ ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉంది, టీడీపీ కూడా ఎన్డీయే అభ్యర్థులకు మద్దతిచ్చింది. ఈ నేపథ్యంలో, జగన్ బీజేపీతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో ఉంది. 2014 నుంచి 2019 వరకు బీజేపీ వైసీపీకి పరోక్ష మద్దతు ఇచ్చిందని, అదే సమయంలో టీడీపీతో కూటమిలో ఉంటూ రాజకీయ సమతుల్యత పాటించింది. జగన్ ఎన్డీయేకు మద్దతిచ్చినప్పుడు, కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమితో దూరం పాటించారు. కాంగ్రెస్‌తో జగన్‌కు ఉన్న గత రాజకీయ విభేదాలు, ముఖ్యంగా 2014లో తెలంగాణ విభజన, ఆయన జైలు శిక్ష వంటి అంశాలు ఈ నిర్ణయంలో ప్రభావం చూపాయి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే అధికారంలో ఉంది, వైసీపీ విపక్షంగా ఉంది. లిక్కర్ స్కామ్ వంటి వివాదాలతో వైసీపీ నాయకులు ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జగన్ రాజకీయ వైఖరిలో ఎలాంటి మార్పు ఉంటుంది అనేది చర్చనీయాంశంగా మారింది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎలక్టోరల్ కాలేజీలో ఎన్డీయేకు స్పష్టమైన మెజారిటీ ఉంది. మొత్తం 786 ఓట్లలో ఎన్డీయేకు 422 ఎంపీల మద్దతు ఉందని, ఇండియా కూటమికి సుమారు 150 ఎంపీల మద్దతు ఉందని అంచనా. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయేకు 25 ఎంపీల మద్దతు(లోక్‌సభలో 21, రాజ్యసభలో 4) ఉంది. అయితే వైసీపీ 11 ఓట్లు ఎన్డీయేకు అదనపు బలాన్ని ఇవ్వగలవు. బీజేపీ ఎప్పుడూ తమ మిత్రపక్షాలను, తటస్థ పార్టీలను ఆకర్షించడంలో నైపుణ్యం కలిగి ఉంది, వైసీపీ ఓట్లు ఈ ఎన్నికల్లో కీలకంగా మారవచ్చు. కాంగ్రెస్ బలపడకుండా చూసేందుకు తటస్థ పార్టీలైన వైసీపీ, బీజేడీ, బీఆర్ఎస్ వంటి వాటిని బీజేపీ తమ వైపు ఆకర్షించే ప్రయత్నం చేస్తుంది. జగన్ మద్దతు ఎన్డీయేకు దక్కితే, ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ రాజకీయ ప్రభావం మరింత పెరుగుతుంది. ఇదే సమయంలో ఎన్డీయేకు మద్దతు ఇవ్వడం ద్వారా వైసీపీ నాయకులపై ఉన్న కేసులు, ఒత్తిడులు తగ్గే అవకాశం ఉంటుందని జగన్ భావిస్తున్నారు. కాంగ్రెస్‌తో గతంలో ఉన్న విభేదాల కారణంగా జగన్ ఇండియా కూటమికి మద్దతిచ్చే అవకాశం చాలా తక్కువ. 2024 జులైలో జగన్ ఢిల్లీలో నిర్వహించిన నిరసన ర్యాలీకి ఇండియా కూటమి నాయకులు(అఖిలేష్ యాదవ్ వంటివారు) మద్దతు ఇచ్చినప్పటికీ, కాంగ్రెస్ ప్రతినిధులు దూరంగా ఉన్నారు. జగన్ సోదరి వైఎస్.షర్మిల నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీతో ఉన్న విభేదాలు ఈ దూరానికి కారణంగా చెప్పవచ్చు. 2014లో తెలంగాణ విభజన సమయంలో కాంగ్రెస్ చర్యలు, జగన్‌పై సీబీఐ, ఈడీ కేసులు వైసీపీని కాంగ్రెస్‌కు దూరం చేశాయి. ఇండియా కూటమితో జతకట్టడం కూడా జగన్‌కు రాజకీయంగా నష్టం కలిగించవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. జగన్ ఎన్డీయేకు మద్దతిచ్చినట్లయితే, ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ సమీకరణలు మారే అవకాశం ఉంది. ఎన్డీయేలో టీడీపీ, జనసేన, బీజేపీ ఇప్పటికే బలంగా ఉన్నాయి. వైసీపీ మద్దతు బీజేపీకి రాష్ట్రంలో మరింత పట్టు ఇవ్వవచ్చు. అయితే, ఇది వైసీపీకి రాజకీయంగా నష్టం కలిగించే అవకాశం ఉంది. టీడీపీతో శత్రుత్వం ఉన్న వైసీపీ ఎన్డీయేకు మద్దతిస్తే, రాష్ట్రంలో తమ ఓటు బ్యాంకును కోల్పోయే ప్రమాదం ఉంది. అయితే ఇదేమయంలో ప్రస్తుతం వైసీపీ నాయకులపై లిక్కర్ స్కామ్ కేసులు, అరెస్టులు ఒత్తిడిని పెంచుతున్నాయి. ఎన్డీయేకు మద్దతిచ్చినట్లయితే, ఈ కేసుల్లో కొంత ఉపశమనం పొందే అవకాశం ఉందని కొందరు భావిస్తున్నారు. ఇక ఇండియా కూటమితో జతకడితే, రాష్ట్రంలో టీడీపీ?జనసేన కూటమికి వ్యతిరేకంగా బలమైన విపక్షంగా నిలిచే అవకాశం ఉంది, కానీ ఇది కాంగ్రెస్‌తో సంబంధాలను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే తటస్థంగా ఉండాల్సి ఉంటుంది. తటస్థ వైఖరి అవలంబించడం ద్వారా జగన్ రాష్ట్ర, జాతీయ ప్రయోజనాలను సమతుల్యం చేయవచ్చు.

## సింగపూర్‌తో గ్యాప్ వచ్చింది...
# అది సరిచేయడానికే వచ్చాను

- సింగపూర్ లో తెలుగు వారితో సీఎం చంద్రబాబు సమావేశం
- సింగపూర్ మళ్లీ ఏపీ క్యాపిటల్ నిర్మాణానికి ముందుకు రాకపోవచ్చన్న చంద్రబాబు
- కానీ జరిగిందేమిటో వారికి వివరిస్తానని వెల్లడి






**సింగపూర్ – సూర్యవాస్తవం, జూలై 27**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటన తొలిరోజున ఏపీఎన్ఆర్ టీ భాగస్వామ్యంతో ఏర్పాటైన తెలుగు డయాస్పొరా కార్యక్రమంలో పాల్గొన్నారు. సింగపూర్ తో పాటు, పొరుగున్న మరో ఐదు దేశాల నుంచి తెలుగు ప్రజలు భారీ ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరుకావడంతో చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికరంగా ప్రసంగించారు. “సింగపూర్ దేశం అంటే నాకు చాలా అభిమానం... గౌరవం. నీతి, నిజాయతీలకు సింగపూర్ దేశం నిలువెత్తు నిదర్శనం. ఈ దేశంలో అవినీతి తక్కువ. సింగపూర్ రోడ్ల మీద ఒక్క కాగితం ముక్క కూడా కన్పించదు. చాలా కాలం క్రితమే చెత్తను కూడా ఎనర్జీగా కన్వెర్ట్ చేసే విధానాన్ని సింగపూర్ ఆచరణలో పెట్టింది. అదే తరహా విధానాన్ని హైదరాబాద్ నగరంలో అమలు చేశాను. చాలా మంది రాజకీయ నేతలు సింగపూర్ వచ్చి ఎంజాయ్ చేసి వెళతారు. కానీ ఏపీ సీఎం మాత్రం ఇక్కడికి వచ్చి తాను చేసిన మంచి పనులను అమలు చేస్తున్నారని సింగపూర్ దేశ మాజీ ప్రధాని లీ క్వాన్ యూ చెప్పారు. ఇలాంటి సింగపూర్ ప్రభుత్వంతో ఏపీకి గ్యాప్ వచ్చింది.

నేను అడిగిన వెంటనే ఉచితంగా అమరావతి కోసం మాస్టర్ ప్లాన్ తయారు చేయడానికి సింగపూర్ ప్రభుత్వం అంగీకరించింది. సింగపూర్ ప్రభుత్వం చాలా దేశాల్లో టౌన్ షిప్ లు కట్టింది. కాబట్టి సీడ్ క్యాపిటల్ నిర్మాణం సింగపూర్ ప్రభుత్వానికే అప్పగించాను. కానీ 2019లో ప్రభుత్వం మారి సింగపూర్ ను తప్పు పట్టే పరిస్థితి తీసుకువచ్చారు. వాటిని సరిదిద్ది... రికార్డులు సరి చేయడానికే సింగపూర్ వచ్చాను. ఏపీ బ్రాండును సింగపూర్ లో తిరిగి నెలకొల్పడానికే వచ్చాను. మన రాష్ట్రంలో ఏ ఒక్కరు తప్పు చేసినా... తెలుగు వాళ్లే చేశారంటారు. ఆ అభిప్రాయాన్ని... సింగపూర్ ప్రభుత్వంలో, సింగపూర్ కంపెనీల్లో తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాను. సింగపూర్ కు కలిగిన అసౌకర్యానికి బాధపడుతున్నానని వారికి చెబుతున్నాను. సింగపూర్ ప్రభుత్వం మళ్లీ సీడ్ క్యాపిటల్ నిర్మాణానికి ముందుకు రాకపోవచ్చు. జరిగిన వాస్తవాలను మాత్రం వారికి తెలియచేస్తాను. 2019లో కూడా మన ప్రభుత్వమే కొనసాగి ఉంటే.. అమరావతి సింగపూర్ స్థాయికి చేరేది. కానీ 2019 ఎన్నికల్లో గ్యాప్ వచ్చింది. మళ్లీ ఇలాంటి పొరపాట్లు రాకుండా చూసుకోవాలి. ఈ బాధ్యత నా మీదే కాదు... మీ మీద కూడా ఉంది” అని చంద్రబాబు భావోద్వేగంగా స్పందించారు.

**పెట్టుబడులతో రండి**

“గతంతో పోల్చుకుంటే ఇప్పుడు సాంకేతికంగా చాలా అంశాలు అందుబాటులోకి వచ్చాయి. అమరావతిలో క్వాంటం వ్యాలీని అభివృద్ధి చేస్తున్నాం. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ప్రకటించాం. సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. ఏపీలో 20 పోర్టులు వస్తాయి.. 15-20 ఎయిర్ పోర్టులకు అవకాశం ఉంది. ఆరోగ్య రంగంలో గేట్స్ ఫౌండేషన్, టాటా సంస్థలతో కలిసి పని చేస్తున్నాం. చాలా మంది తెలుగు వాళ్లు విదేశాల్లోని ప్రముఖ సంస్థల్లో కీలక స్థానాల్లో ఉన్నారు. ఇలాంటి వారు తమ అనుభవాన్ని ఏపీకి అందించవచ్చు. పీ4 కార్యక్రమం ద్వారా పేదరికాన్ని తగ్గించేందుకు నో పావర్టీ మిషన్ ప్రారంభించాను. మీ మీ గ్రామాల్లోని పేదలను దత్తత తీసుకోండి. విదేశాల్లో స్థిరపడిన తెలుగు వాళ్లు.. పీ4లో భాగస్వాములుగా ఉంటే.. నాకు అంతకు మించిన ఆనందం వేరొకటి ఉండదు.

**ఏపీలో వెంకన్న ఉండడం మన అదృష్టం**

“తిరుపతి బాలాజీ మన రాష్ట్రంలో ఉండడం అదృష్టం. ఎన్ని కష్టాలున్నా.. వేంకటేశ్వరస్వామిని తలుచుకుని సంకల్పం తీసుకుంటే సమస్య పరిష్కారమై పని అయిపోతుంది. ఎన్నార్టీలకు తిరుమల వెంకన్న దర్శనం కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తాం. ప్రతి దేశ రాజధానిలో వెంకటేశ్వరస్వామి దేవాలయం ఉండాలి. సింగపూర్ నుంచి ఏపీలోని విజయవాడ, విశాఖ, తిరుపతికి నేరుగా విమానాలు వచ్చేలా చేస్తాం. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతాం. సింగపూర్ లో బెంగాలీ, హిందీ, తమిళ్ రెండో భాషగా ఉన్నాయి. తెలుగు కూడా రెండో భాషగా పెట్టాలని కోరుతున్నాను. ఇక్కడే ఉన్న భారత హైకమిషనర్ ఈ మేరకు చొరవ తీసుకోవాలని కోరుతున్నాను” అని చంద్రబాబు చెప్పారు.

**సరైన నాయకుడు ప్రధాని మోదీనే**

“ప్రస్తుతం భారత దేశానికి ప్రజలే ఆస్తి. గతంతో పోల్చుకుంటే ప్రపంచ వ్యాప్తంగా భారత దేశానికి గౌరవం పెరిగింది. ఈ సమయంలో దేశానికి సరైన నాయకుడుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం వహిస్తున్నారు. దేశంలో చాలా మంది ప్రధానులు... చాలా మంది సీనియర్ లీడర్లను చూశాను. రైట్ టైమ్, రైట్ ప్లేస్, రైట్ లీడర్ నరేంద్ర మోదీ. మోదీ మనకు పెద్ద వరం. అమెరికాకు చెందిన ఓ సంస్థ చేసిన సర్వేలో మోదీ ప్రపంచంలోనే పాపులర్ లీడరుగా నెంబర్-1 స్థానంలో నిలిచారు. ప్రధానికి 75 శాతం అప్రూవల్ రేటింగ్ ఉంది. దేశానికి గుర్తింపు, సుస్థిరత మోదీ వల్లే వచ్చింది. ఇలాంటి సమయంలో ఆకాశమే హద్దుగా దూసుకెళ్లాలి. నరేంద్ర మోదీ వికసిత్ భారత్ నినాదంతో వెళుతన్నారు. నేను స్వర్ణాంధ్ర సంకల్పంతో ముందుకెళుతున్నాను” అని అన్నారు.

# నవంబర్‌లో ఇంధన రంగ కార్మికుల జాతీయ సదస్సు

- తిరువనంతపురంలో వివిధ కార్మిక సంఘాల సంయుక్త సమావేశంలో నిర్ణయం
- ఎలమరం కరీం చైర్మన్‌గా సన్నాహక కమిటీ ఏర్పాటు



**తిరువనంతపురం – సూర్యవాస్తవం, జూలై 27**

దేశ ఇంధన రంగ భద్రతను, సార్వభౌమత్వాన్ని రక్షించ ˇడమే లక్ష్యంగా ఇంధన రంగ కార్మికుల జాతీయ సదస్సు ఈ ఏడాది నవంబర్‌లో ఢిల్లీలో నిర్వహించ నున్నారు. తిరువనంతపురంలోని బిటిఆర్ మెమో రియల్‌లో ఆదివారం జరిగిన దేశంలో ప్రధానమైన ఇంధన రంగ కార్మికుల సంఘాల సంయుక్త సమా వేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకు న్నారు. బొగ్గు, పెట్రోలియం, విద్యుత్ రంగాలకు చెందిన కార్మికుల పోరాటాలను సమన్వయం చేసే లక్ష్యంతో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐసిడబ్ల్యూఎఫ్), పెట్రోలియం అండ్ గ్యాస్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (పిజిడబ్ల్యూఎఫ్ఐ), ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఇఎఫ్ఐ)లకు చెందిన నాయకులు, ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. దేశ ఇంధన రంగ భద్రతను, సార్వ భౌమత్వాన్ని రక్షించ డానికి నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా ఇంధన రంగ కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని కాపాడటానికి సమన్వయంతో పోరాటం ప్రారంభించడానికి ఇంధన రంగాల కార్మికులను సంఘటితం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇంధన రంగ కార్మికుల జాతీయ వేదికను ఏర్పాటు చేయడం కోసం ఒక సన్నాహక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఎలమరం కరీం చైర్మన్‌గా స్వదేశ్ దేవ్‌రారు, ప్రదీప్ మాయేకర్, జికె శ్రీవాస్తవ్‌లు డిప్యూటీ చైర్‌పర్సన్‌లుగా డిడి రామానందన్, నోగెన్ చుటియా, సుదీప్ దత్తాలు కన్వీనర్లుగా ఈ కమిటీని నియమించారు.

ఆదివారం సమావేశంలో యావత్తు ఇంధన రంగంపై విధానపరమైన దాడుల గురించి, ప్రజాప్రయోజనాల రక్షించుకోవడం ప్రాముఖ్యతను గురించి చర్చించారు. నవంబర్‌లో జాతీయ ఇంధన కార్మికుల సమావేశాన్ని ఢిల్లీలో నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇంధన రంగ ప్రైవేటీకరణ, కాంట్రాక్టులైజేషన్‌కు వ్యతిరేకంగా కార్మికుల సమిష్టి స్వరాన్ని విస్తృతం చేయడం ఈ సమావేశం లక్ష్యమని కరీం తెలిపారు. స్వదేశ్ దేవ్‌రారు బ్యాక్‌గ్రౌండ్ నోట్‌ను సమర్పించారు. సుదీప్ దుత్తా అనుబంధ నోట్‌ను ప్రవేశపెట్టారు. డిడి రామానందన్, నోగెన్ చుటియా కీలక ఉపన్యాసం చేశారు. దీపా కె రాజన్, ప్రదీప్ మాయేకర్, జికె శ్రీవాస్తవ్, ఎంజి సురేష్ కుమార్, ప్రదీప్ శ్రీధరన్, ఆర్‌పి సింగ్, బి బాలగోపాల్, ఎంజి అజి సమావేశంలో ప్రసంగించారు.

# స్పోర్ట్స్, స్పేస్ స్టార్టప్‌లు పెట్టేందుకు రండి

**- మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ**



**న్యూఢిల్లీ – సూర్యవాస్తవం, జూలై 27:** దేశంలో స్పోర్ట్స్, స్పేస్ స్టార్టప్‌లు పెట్టేందుకు యువ పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ఈ రంగంలో ఎన్నో అవ కాశాలు ఉన్నాయని, యువత ఆ దిశగా ఆలోచనలు చేయాలని కోరారు. ఆదివారం 124వ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోడీ మాట్లాడారు. క్రీడా రంగంలోని స్టార్టప్‌లకు పూర్తి మద్దతు ఇస్తానన్నారు. ఇటీవల కాలంలో భారత్‌లో చాలా విశేషాలు చోటుచేసుకున్నాయని, అవన్నీ ప్రతి భారతీయుడికీ గర్వకారణమని అన్నారు. శుభాన్షు శుక్లా ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్-ఎస్)కు వెళ్లి వచ్చాక దేశమంతా ఆనందంతో పొంగిపోయిందన్నారు. అలాగే, చంద్రయాన్-3ని విజయవంతంగా ల్యాండింగ్ చేసిన తరువాత దేశంలో ఓ ప్రత్యేకమైన శాస్త్రీయ వాతావరణం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం విద్యార్థులు, చిన్నారులు సైతం అంతరిక్ష రంగం మీద ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. దేశంలో విద్యార్థులు స్పేస్ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్నారని, ప్రతి విద్యార్థి ఓ కొత్త ఆలోచనతో ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో ఐదేళ్ల క్రితం 50 కంటే తక్కువ స్పేస్ స్టార్టప్స్ మాత్రమే ఉండేవని, ప్రస్తుతం స్పేస్ రంగంలో 200 కంటే ఎక్కువ స్టార్టప్స్ ఉన్నాయని వివరించారు. ‘ఇన్‌స్పైర్ మనక్ అభియాన్’ ఈ పథకం విద్యార్థులను ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సహించే కార్యక్రమమని, ప్రతి పాఠశాల నుంచి ఐదుగురిని దీనికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 23న నేషనల్ స్పేస్ డే సందర్భంగా నమో యాప్ ద్వారా దేశ ప్రజలు తమ సూచనలు, సలహాలు పంపాలని కోరారు.

# అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తులపై అభిశంసన

**న్యూఢిల్లీ – సూర్యవాస్తవం, జూలై 27**

అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులపై అభిశంసన తీర్మానాన్ని ప్రభుత్వం, ప్రతిపక్షం సిద్ధం చేస్తున్నాయి. ఈ సంవత్సరం బీహార్‌లో కీలకమైన ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సీనియర్ న్యాయమూర్తులను తొలగించడంతో తనపై ఉన్న అవినీతి ముద్రను తగ్గించుకునేందుకు, ‘అవినీతి వ్యతిరేక’ సానుకూలతను పెంచుకునేందుకు దోహదపడుతోందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

**ఇద్దరు న్యాయమూర్తులు.. రెండు వివాదాలు**

అప్పటి ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో కాలిపోయిన నగదు కుప్పలు కనిపించిన తరువాత, ప్రభుత్వం, ప్రతిపక్షం రెండూ ఆయనపై అభిశంసనకు సిద్ధమయ్యాయి. ఇటీవల లోక్‌సభలో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే న్యాయమూర్తి తనను తొలగించాలని సిఫార్సు చేసిన న్యాయ వ్యవస్థ అంతర్గత నివేదికను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.



మితవాద సంస్థ విశ్వ హిందూ పరిషత్ కార్యక్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తరువాత జస్టిస్ శేఖర్ యాదవ్‌పై అభిశంసన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనను తొలగించాలని కోరుతూ 55 మంది ఎంపిల బృందం రాజ్యసభకు లేఖ రాసింది.

**33 శాతం హైకోర్టు పోస్టులు ఖాళీలు**

అభిశంసనలు ప్రాధాన్యాంశంగా మారినప్పటికీ, న్యాయవ్యవస్థ దాని సంఖ్యా సమస్యను పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అడిగిన ప్రశ్నకు సమాధానంగా న్యాయ మంత్రిత్వశాఖ అర్జున్ రామ్ మేఘ్వాల్ సమాధానం ఇస్తూ 371 (33 శాతం) హైకోర్టు న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

**ఎందుకు ఆలస్యం?**

రాజ్యాంగంలోని ఆర్టికల్ 217, 224 ప్రకారం నియామక ప్రక్రియ ఉంటుంది. మొత్తం ప్రక్రియ అనేక దశలను కలిగి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించిన తరువాత హైకోర్టులోని ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు ఒక షార్ట్‌లిస్ట్‌ను రూపొందిస్తారు. ఈ సిఫార్సులను సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదం కోసం పంపుతారు. అయితే, ఏదైనా ఖాళీ ఏర్పడటానికి ఆరు నెలల ముందు హైకోర్టులు ఈ సిఫార్సులను సమర్పించాలని మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, న్యాయ మంత్రిత్వశాఖ కాలక్రమం పాటించటం లేదు.

## ఆర్యవైశ్య మహాసభ

# అధ్యక్షుల దంపతులకు ఘన సన్మానం





**నాయుడుపేట- సూర్య వాస్తవం, జూలై 27**
ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్)ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా రూరల్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గూడూరు కిషోర్ కుమార్, లక్ష్మి దంపతులకు ఘన సన్మానం సన్మానించారు. ఆదివారం తిరుపతి పట్టణం లోని ఇస్తా ఫంక్షన్ హాల్‌లో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు జక్కా సుబ్బరాజు అధ్యక్షతన శ్రీవారికి వైశ్యుల వితరణ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా రూరల్ అధ్యక్షులు గూడూర్ కిషోర్ కుమార్ దంపతులను సత్కరించారు. నాయుడుపేట పట్టణానికి చెందిన గూడూరు కిషోర్ కుమార్ తిరుపతి జిల్లా రూరల్ అధ్యక్షులుగా బాధ్యతలను స్వీకరించిన నాటినుండి సమన్వ యంతో పని చేస్తూ, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి,వైశ్యుల అభ్యున్నతకు కృషి చేస్తూ జిల్లా అధ్యక్ష పదవికి వన్నెతెచ్చారని ఆర్యవైశ్య మహాసభ (వామ్ )రాష్ట్ర అధ్యక్షులు జక్కా సుబ్బరాజు కొనియాడారు. గూడూరు కిషోర్ కుమార్ దంపతులతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఆర్యవైశ్య దంప తులను వామ్ ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం కె.కృష్ణారెడ్డి శాసనాల ద్వారా పరిశోధించి రచిం చిన శ్రీవారికి ఆర్యవైశ్యుల వితరణ అనే పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం పుస్తకాలను పంచిపెట్టారు. 1600 సంవత్సరాల క్రితమే శ్రీవారి సేవలో వైశ్యులు ఎనలేని సేవలు అందించి వారి ఉదాహరణ చాటుకున్నారని వాటిని శాసనాలలో పొందు పరిచి ఉన్నారని భావితరాలకు వైశ్యులు అందించిన సేవలు తెలిసేలా ఆ శాసనాల ఆధారితంగా పుస్తకాన్ని రచించి ప్రచురించినట్లు వాన్ రాష్ట్ర అధ్యక్షులు జక్కా సుబ్బరాజు తెలిపారు.

# వీకే పార్వతమ్మ మరణం పార్టీకి తీరని లోటు ...

**- ఆమె ఆశయాలను కొనసాగిస్తాం**
**- సంస్మరణ సభలో**
**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ**



**అనంతపురం అర్బన్ - సూర్య వాస్తవం, జూలై 27:** అనంతపురం నగరంలో హెచ్ ఎల్ సి కెనాల్ వద్ద ఉన్న వీకే మెమోరియల్ హాల్ నందు సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో కమ్యూనిస్టు పార్టీ మాజీ శాసనసభ్యులు వికే ఆదినారాయణ రెడ్డి సతీమణి వీకే పార్వతమ్మ గారి సంస్మరణ సభ నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కమ్యూనిస్టు పార్టీ నాయకులు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో గుర్తుండిపోయే నాయకులు కామ్రేడ్ ఐదుకల్లు సదాశివన్, నీలం రాజశేఖరెడ్డి, తరిమెల నాగిరెడ్డి, వి.కె. ఆదినారాయణ రెడ్డి తోపాటు, ఆదినా రాయణ రెడ్డి సతీమణి కీర్తిశేషులు కామ్రేడ్ వి.కె. పార్వ తమ్మ పాత్ర రాజకీయంగా వినూత్నంగా నిలిచి ందన్నారు. పార్వతమ్మ 1926లో శింగనమల మండలంలోని తరిమెల గ్రామంలో జన్మించి చిన్ననాటి నుంచే అనేక కష్టాలు ఎదుర్కొన్నారన్నారు. 1946లో వి.కె. ఆది నారాయణ రెడ్డి తో వివాహం తరువాత ఆమె జీవితం పూర్తిగా కమ్యూనిస్టు ఉద్యమంతో మమేకమైందన్నారు. ఉద్యమ నాయకులు, కార్యకర్తలకు ఆశ్రయంగా నిలిచిన ఆమె ఇంటిని పార్టీ శిక్షణ కేంద్రంగా మార్చారు అని పేర్కొన్నారు. జై ఆంధ్ర ఉద్య మంలో ఎదురైన రాళ్లదాడి సమయంలోనూ ధైర్యంగా నిలిచిన ఆమె, ఉద్యమ పట్ల ఎనలేని నమ్మకంతో పోరాటం జరిగిందన్నారు. ఆమె పార్టీ ఆశయాల పట్ల అస్థిరమైన సంఘటనలలోనూ నిలదొక్కుకొని, వి కే పార్వతమ్మ లేని లోటు పార్టీకి తీవ్రమైన నష్టమని పేర్కొన్నారు,, వి.కె పార్వతమ్మ ఆశయాలు కొనసాగిస్తామని తెలిపారు... రామకృష్ణ తో పాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ మాజీ శాసనసభ్యులు విశ్వేశ్వర్ రెడ్డి నాయకులు శ్రీనివాసులు నాయుడు సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ సిపిఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప సిపిఐ ఎమ్మెల్యే జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి వైఎస్ఆర్సిపి నాయకులు సోమశేఖర్ సిపిఐ ఎంఎల్ చంద్రశేఖర్ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిలు నారాయణస్వామి మల్లికార్జున కార్యదర్శులు రాజారెడ్డి నాయకులు రామకృష్ణ శ్రీరాములు రమణయ్య నారాయణస్వామి రాజేషు కృష్ణుడు కుళ్లాయి స్వామి వివిధ నియోజకవర్గాల సిపిఐ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# బదిలీ ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలి

**- నోబుల్ టీచర్ అసోసియేషన్**
**రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు**



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 27:** ఇటీవల బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు సంబంధించిన పొజిషన్ ఐడీలు వెంటనే కేటాయింపు చేసి జీతాలు చెల్లించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని నోబుల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాస్ రాజు నేడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది. రాయచోటి నందలి స్థానిక డైట్ కేంద్రంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల ముఖ ఆధారిత హాజరు నమోదుకు గతంలో ఇచ్చిన హామీలను అనుసరించి ఉదయం తొమ్మిది గంటల పది నిమిషాల వరకు గ్రేస్ పీరియడ్ గా ప్రకటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలలు అయినప్పటికీ పదవతరగతి స్పాట్ వాల్యుయేషన్ విధులు నిర్వహించిన వారికి పైకము చెల్లించకపోవడం దారుణం అన్నారు దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు ఇటీవల బదిలీపై వెళ్లి రిలీవర్ రాకపోవడం వల్ల పూర్వపు పాఠశాలల్లో కొనసాగుతున్న ఉపాధ్యాయులకు వెంటనే రిలీవ్ చేయాలన్నారు డీఎస్సీ ఉపాధ్యాయులు వచ్చేవరకు ఎంత సమయం పడుతుందో తెలియక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు అన్నారు వెంటనే విద్యా వాలంటీర్లు నియమించి వారికి ఉపశమనం కల్పించి విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు 2003 నోటిఫికేషన్ ద్వారా నియామకం ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ప్రభుత్వం కొన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాల న్నారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్ అసోసియేషన్ నాయకులు మధుసూదన్ రెడ్డి, పకీర, నరసింహారెడ్డి, బచ్చుల శ్రీని వాసులు, వేణుగోపాలరావు, కులశేఖర్ రెడ్డి, గోవిందు నాగరాజ, రాజబాబు, ఆసిఫ్, వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం

**కుప్పం-సూర్య వాస్తవం, జూలై 27:** కుప్పం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సాయి మాత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వ హించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు జగదీష్ బాబు మాట్లాడుతూ జిల్లా అంధత్వ శాఖ సహకారంతో బెంగళూరు నకరానికి చెందిన శంకర్ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో 90 మంది పాల్గొనగా, వారిని పరీక్షించిన వైద్యులు అందులో 29 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్టు తెలిపారు. వీరికి సోమవారం నాడు బెంగళూరు నగరంలోని శంకర్ కంటి ఆసుపత్రి నందు ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది బాబు, విజయ్, కాంచన తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా 57వ భజన



**గుత్తి - సూర్య వాస్తవం, జులై 27:** గుత్తి మండలంలో వన్నేదొడ్డి గ్రామంలో ఆదివారం 27 /7/2025 ఉదయం 11:00గ, నుండి మధ్యాహ్నం1:00గం,,వరకు తెగదొడ్డి తిమ్మారెడ్డి స్వగృహంలో 57వ భజన అంగరంగ వైభవంగా జరిగింది తల్లి,తండ్రిల దినోత్సవం శుభా కాంక్షల సందర్భంగా భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవంలో భాగంగా స్వామివారి లక్షగృహ దివ్య నామ సంకీర్తన 5 7వ భజన అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గుత్తి సత్య సాయి బాబా కమిటీ మెంబర్లు శ్రీ షిర్డీసాయిబాబా మందిరం కమిటీ మెంబర్లు సాయి భక్తులు, వన్నెదొడ్డి మా రుతి భజన బృందం, పలువురు బందు, మిత్రులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గుత్తిలో 'తెరచాప' సినిమా షూటింగ్



**గుత్తి - సూర్య వాస్తవం, జులై 27:** గుత్తి పట్టణం లోని ఎం ఎస్ హై స్కూల్లో నందు ఆదివారం సిని మా షూటింగ్ జరిగింది. అనన్య క్రియేషన్స్ పతాకంపై తెరచాప సి నిమా నిర్మిస్తున్నారు. విషపూరిత ఆహారం తిని పిల్లలు ఆసుపత్రి పాలైన సన్నివేశాన్ని దర్శకుడు జోయల్ జార్జ్ నేతృత్వంలో ఇక్కడ చిత్రీకరించారు. మూడు గంటల పాటు షూటింగ్ జరిగింది. నిర్మాత దుర్గం కైలాస్, హీరో నవీన్ రాజ్ సింగర్పు,హీరోయిన్ పూజ సుహా సిని,విల న్ రాజేశ్ నాయక్,నాగ మల్లేష్ సీనియర్ యాక్టర్, కెమెరా మెన్, గుత్తి శాంతి ప్రియ హాస్పిటల్ డాక్టర్ మరియు సి బ్బంది గుత్తి ప్రజలు పాల్గొన్నారు.

## ఇరు వర్గాల ఘర్షణలో

# ముగ్గురికి గాయాలు






**మదనపల్లె - సూర్య వాస్తవం, జులై 27:** ఇంటి ముందు ఉన్న ఖాళీ స్థలంలో కట్టెలు వేయడంతో తలెత్తిన గొడవలో ఇరు వర్గాలు ఘర్షణ పడి ముగ్గురు గాయ పడ్డారు. ఈ సంఘటన ఆదివారం మదనపల్లె మండలం లో జరిగింది. బాధితుల కథనం మేరకు.. పోతబోలు పంచాయతీ, గాండ్లపల్లి కు చెందిన రాధాకృష్ణ(55) రత్న(48) దంపతులు ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో కట్టెలు వేసు కొంటుండగా విజయకుమారి అడ్డుకుంది. ఈ స్థలం తమదని ఇక్కడ కట్టెలను నిల్వ చేయకూడదని ఇరువురు ఘర్షణకు దిగారు. దీంతో ఇరువర్గాల వారు పరస్పర దాడులు చేసుకోవడంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు అడ్డుకొని బాధితులను మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

# ఉభయసభల మైనార్టీ సంక్షేమ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే దగ్గుపాటి

**- అల్పసంఖ్యాక వర్గాల**
**అభ్యున్నతి కోసం పని చేస్తా : ఎమ్మెల్యే దగ్గుపాటి**
**- అర్బన్ నియోజకవర్గంలో**
**మైనార్టీలకు సహాయపడే అవకాశం వచ్చింది**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 27:** ఉభయ సభల సంయుక్త కమిటీల్లో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటికి చోటు దక్కింది. తాజాగా రాష్ట్ర శాసనసభ, శాసన మండలికి, ఉభయసభలకు సంయుక్త కమిటీలను నియమించారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజ్ సంయుక్త కమిటీ లను, మండలి చైర్మన్ శాసన మండలి కమిటీలను నియమించారు. 2025-26 సంవత్స రానికి సంబ ంధించిన వ్యవహారాలను ఈ కమి టీలు పర్యవేక్షించనున్నాయి. ఇందులో మైనార్టీ సంక్షేమ కమిటీలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు చోటు దక్కింది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నాయకుల, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు. అల్పసంఖ్యాక వర్గాల అభ్యున్నతి కోసం పని చేసే అవకాశం వచ్చిందని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. ఈ అవకాశం ఇచ్చిన శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. అర్బన్ నియోజకవర్గంలో మైనార్టీలు అత్యధిక సంఖ్యలో ఉన్నారని వీరికి సాయం చేసేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వీరి కోసం శక్తివంచన లేకుండా వారి కోసం పని చేస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# వివాహిత ఆత్మహత్యాయత్నం



**మదనపల్లె - సూర్య వాస్తవం, జూలై 27:** కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పెంచుపాడు పంచాయతీ, దాదినాయుని తండాకు చెందిన బాలాజీ నాయక్ భార్య శాంతమ్మ(35) కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్సలు అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

# అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం

## - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లి - సూర్య వాస్తవం, జూలై 27:** మాజీ భారత రాష్ట్రపతి, భారత క్షిపణి పితామహుడు,భారత రత్న బిరుదాంకితుడు స్వర్గీయ ఏపీజే అబ్దుల్ కలాం 10 వ వర్ధంతిని వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి మాట్లాడుతూ కలాం నిరాడం బరతకు, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం అని కొనియాడారు. ఆయన నిత్య విద్యార్థి.అందుకే ఆయన పుట్టిన రోజు అయిన అక్టోబర్ 15 ను ప్రపంచ విద్యార్థి దినంగా ఐక్య రాజ్య సమితి ప్రకటించింది. స్వయం కృషి,స్వీయ ప్రతిభతో ఒక సామాన్యుడు మాన్యుడు, అసామాన్యుడు కాగలడని,ఒక పేపర్ బాయ్ శాస్త్ర వేత్త కాగలడని,ఒక రామేశ్వరం బాలుడు రాష్ట్ర పతి కాగలడని కలాం నిరూపించారు. కలలు కనండి - వాటిని సా చేసుకోండి అని అబ్దుల్ కలాం ఇచ్చిన అమర సందేశం ప్రపంచ వ్యాప్తంగా యువతకు తారక మంత్రంగా పని చేసింది. కలాం జీవితం అందరికీ ఆదర్శం, అనుసరణీయం, స్ఫూర్తిదాయకం, మార్గదర్శకం అని తులసి రెడ్డి కీర్తించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం,వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్,వేమా రాజా,బద్రి నాథ్, హన్సికా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సుబ్బ లక్ష్మమ్మ మరణం బాధాకరం: తులసి రెడ్డి:** తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకురాలు శ్రీమతి సుబ్బ లక్ష్మమ్మ పరమ పదించడం బాధాకరమని తులసి రెడ్డి అన్నారు.సుబ్బ లక్ష్మమ్మ క్రమ శిక్షణతో కూడిన హుందా రాజకీయాలు చేసిందని తులసి రెడ్డి కొనియాడారు. వారి కుటుంబ సభ్యులు తనకు ఎంతో ఆత్మీయులను తులసి రెడ్డి అన్నారు. సుబ్బ లక్ష్మమ్మ పవిత్రాత్మకు పరమేశ్వరుడు ప్రశాంతిని ప్రసాదించాలి అని తులసి రెడ్డి ప్రార్థించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాప సానుభూతి తెలిపారు. **జాతీయ తల్లి దండ్రుల దినోత్సవం:** ఆదివారం జాతీయ తల్లిదండ్రుల దినం. తల్లి దండ్రులు ప్రత్యక్ష దైవాలు. మాతా పితలు,మిత్రుడు వీరు ముప్పురే హితులు అని సంపూర్ణ నీతి చంద్రికలో పరవస్తు చిన్నయ సూరి అంటారు. అటువంటి తల్లి దండ్రులను వృద్ధాప్యంలో కొందరు బిడ్డలు పట్టించు కోకపోవడం దురదృష్టకరం.

## భారత రత్న డాక్టర్
# ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి



**గుత్తి - సూర్య వాస్తవం, జులై 27:** గుత్తి పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల భవనం లో భారతరత్న డాక్ట ర్.ఏ.పి.జె. అబ్దుల్ కలాం 10 వ వర్ధంతి కార్యక్రమం పెన్షనర్స్ నాయకులు సె క్రెటరీ రామ్ మోహన్,అదనపు కా ర్యదర్శి జెన్నే కుల్లాయిబాబు ఆ ధ్వర్యంలో ఘనంగా నివాళుల ర్పించారు.ఆదివారం ఉదయం పె న్షనర్స్ భవనంలో అదనపు కా ర్యదర్శి జెన్నే కుల్లాయిబాబు అ బ్దుల్ కలాం చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ భారత దేశరక్షణ రంగాన్ని అగ్ర పథంలో నిలిపిన మహెూన్నత వ్యక్తి రాష్ట్రపతి పదవికే వన్నె తె చ్చిన మహనీయులు. ప్రజలు మె చ్చిన రాష్ట్రపతి,భారత్ ను అణు దేశంగా మార్చిన మిస్సైల్ మ్యా న్,తన ప్రసంగాల ద్వారా యువ తలో స్ఫూర్తి నింపిన మహనీయు డు డాక్టర్.ఏ.పి.జె.అబ్దుల్ కలాం. నేడు వర్ధంతి సందర్భంగా దేశాని కి వారందించిన సేవలను ఘనం గా స్మరించుకుందాము అని అద నపు కార్యదర్శి జెన్నే కుల్లాయి బాబు తెలిపారు.ఈ కార్యక్రమం లో అదనపు కార్యదర్శి జెన్నే కు ల్లాయి బాబు,సెక్రెటరీ రామ్ మో హన్,షైక్షావలి,నారాయణరెడ్డి,గోవిందప్ప,నారాయణ శెట్టి,శా మ్యూల్,దేవదాస్ మొదలగు వా రు పాల్గొన్నారు.

# నేడు కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## - జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 27:** ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 28న సోమవారం ఉదయం 10.00గం.ల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహి స్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలను జిల్లా కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్ను సంప్రదించగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

# వాహనం ఢీకొని మహిళకు తీవ్రగాయాలు



**మదనపల్లె- సూర్య వాస్తవం, జూలై 27 :** ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళను బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన ఆదివారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. పుంగనూరు మండలం, పత్రపల్లి తండాకు చెందిన శివశంకర్ భార్య పద్మ (29) సొంత పనిమీద ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వచ్చింది. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి సాయిబాబా గుడి వీధిలోకి వెలుచుండగా అటుగా వచ్చిన బొలెరో వాహనం ఆమెను ఢీకొంది. ఈ ప్రమాదంలో పద్మ తీవ్రంగా గాయపడడంతో గమనించిన స్థానికులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. రెండో పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

# రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌ను కలిసిన ముస్లిం ఐక్య వేదిక కో-ఆర్డినేటర్ రషీద్

**చిత్తూరు - సూర్య వాస్తవం, జూలై 27 :** రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ హాజీ అబ్దుల్ అజీజ్‌ను ఆదివారం రాష్ట్ర ముస్లిం ఐక్య వేదిక కో ఆర్డినేటర్ రషీద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో వివిధ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి బోర్డు ఆస్తులను పరిరక్షించాలని ముస్లిం ఐక్యవేదిక ద్వారా కోరామని వారి సూచనలు సలహాలు తీసుకోవడం జరిగిందని ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్ఎం రషీద్ తెలిపారు.



## భవన కార్మికుడు
# ఆత్మహత్యాయత్నం

**మదనపల్లె - సూర్య వాస్తవం, జూలై 27 :**

భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆది వారం తంబళ్లపల్లి మండలంలో చోటు చేసుకుంది. బాధిత యువకుడి అవ్వ తెలిపిన వివరాల మేరకు.. కోసువారిపల్లి సమీ పంలోని వడ్డిపల్లికి చెందిన లేట్ కృష్ణప్ప కుమారుడు నాగార్జున (22) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ యువకుడికి తల్లిదండ్రులు లేకపోవడంతో అవ్వ పాపమ్మ పోషించుకుంటూ ఆలనాపాలనా చూస్తోంది. నాగార్జున అవ్వవద్ద ఉంటూ పనులకు వెళ్లి జీవనం చేసేవాడు. ఈ క్రమంలో ఏమి జరిగిందో తెలియదు కానీ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వృద్ధాప్యంలో ఉన్న పాపమ్మ స్థానికుల సాయంతో మనవడిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించింది. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు తంబళ్లపల్లి పోలీసులు విచారణ చేస్తున్నారు.

# పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యం

**కుప్పం- సూర్య వాస్తవం, జూలై 27 :**

కుప్పం ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు బి ఆర్ డి మెమోరియల్ హాస్పిటల్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు తెలిపారు. బి ఆర్ డి హాస్పిటల్ నందు లయన్స్ క్లబ్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయ వంతంగా ముగిసింది. ఈ సందర్భంగా బిఆర్‌డి మెమోరియల్ ఆసుపత్రి వ్యవస్థాపక అధ్యక్షులు, లయన్స్ క్లబ్ సలహాదారు మహేష్ మాట్లాడుతూ బ్రెయిన్స్ హాస్పిటల్, అల్టియస్ హాస్పిటల్ బెంగళూరు వారిచే నిర్వహించిన వైద్య శిబిరం ద్వారా ఉచిత గుండె, న్యూరో ఈ. ఎన్. టి. సేవలను ఉచితంగా అందించినట్టు తెలిపారు.

ఈ శిబిరం నందు 200 మంది పాల్గొనగా, అందులో 25 మందిని గుండె, నరాల సంబంధిత శస్త్ర చికిత్సకు వైద్యులు సిఫార్సు చేసినట్టు తెలిపారు. వీరందరికీ ఉచిత వైద్య సేవలను అందించనున్నామని, శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఈసిజి, 2డి, ఎకో పరీక్షలు నిర్వహించి అవసరమైన వాళ్లకి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. హరికిరణ్, డా. నితిన్, లయన్స్ క్లబ్ సభ్యులు సెల్వం, సెంథిల్ కుమార్, శివ ప్రసాద్, చరణ్, ప్రసాద్, డా. కృష్ణమూర్తి, డా. వరదరాజులు, పిఆర్‌ఓలు రాజకుమార్, పురుషోత్తం, మణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




# దొంగ దొరికాడు....!

## - ఆసుపత్రిలో వైద్య విభాగాలకు సంబంధించిన సీళ్ల చోరీ దొంగ పట్టివేత



**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం, జూలై 27:** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పరిధిలో వివిధ వైద్య విభాగ అధిపతులకు సంబంధించిన సీళ్లను దొంగలించిన దొంగను ఎట్టకేలకు పట్టుకున్నారు. హోమియోపతి హౌస్ సర్జన్‌గా వ్యవహరిస్తున్న షారుక్ అహ్మద్ దొంగిలించాడని సిసి ఫుటేజ్ ఆధారంగా గుర్తించడం జరిగిందని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మల్లికార్జున రెడ్డి శనివారం రాత్రి తెలియజేశారు. ఆయా విభాగాలలో కీలకంగా ఉన్న వైద్యాధికారులకు సంబంధించిన వాటిని అతను దొంగిలించినట్లుగా సీసీ ఫుటేజ్ లలో లభ్యమైన ఆధారాలను పరిశీలించిన అనంతరం నిర్ధారించామని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇలాంటి దొంగతనాలు జరుగుతున్న ఉన్నతాధికారులు కనీస పర్యవేక్షణ చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న వైనాన్ని పూర్తిగా భిన్నమైన వ్యవహారంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం ప్రత్యేక చొరవతో దొంగిలించిన అతనిని అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే ఎంతటి వారినైనా ఉపేక్షించమని ఆయన హెచ్చరించారు. సంబంధిత అధికారులు కూడా పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

# 19 మందికి కంటి ఆపరేషన్లు

**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, జూలై 27 :** అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 19 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు అన్నమయ్య జిల్లా పరిధిలోని రాజంపేట,రైల్వే కోడూరు, పీలేరు నియోజకవర్గంలోని కెవిపల్లె,ఎర్రవారిపాలెం,కలకడ,కలికిరి,గుర్రంకొండ,పెద్దమండెం లతో పాటు కదిరి, ఎన్.పీ.కుంట, చక్రాయపేట తదితర ప్రాంతాల నుండి వచ్చిన 50 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 19 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు.అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు,మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప గుప్తా,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ భాష,చెన్నముక్కపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి,కంటి వైద్యులు సురేష్ బాబు,భార్గవి,ఆప్తమాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# విశాఖకు 20 వేలకోట్లు పెట్టుబడులు



**విశాఖపట్టణం-సూర్యా వాస్తవం:** విశాఖపట్నం యువతకు పండుగలాంటి వార్త! టీసీఎస్, కాగ్నిజెంట్ బాటలో మరిన్ని దిగ్గజ సంస్థలు వైజాగ్ గడ్డపై పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. దాదాపు రూ.20 వేల కోట్ల పెట్టుబడులతో వేలాది ఉద్యోగాలు రానున్నాయి. ఏయే సంస్థలు వస్తున్నాయి? ఎక్కడ పెట్టుబడులు పెట్టనున్నారు? యువతకు ఎలాంటి అవకాశాలు లభించనున్నాయి? విశాఖపట్నం యువతకు ఎగిరి గంతేసే వార్త. సాగర తీరం విశాఖకు మరిన్ని ప్రతిష్టాత్మక సంస్థలు తరలి రానున్నాయి. విశాఖపట్నంలో టీసీఎస్ , కాగ్నిజెంట్ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. అలాగే లులు గ్రూప్ కూడా విశాఖపట్నంలో పెట్టుబడులు పెట్టనుంది. తాజాగా మరికొన్ని సంస్థలు వైజాగ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రాగా.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఏపీ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనలు ఆమోదం లభించింది. రూ.20 వేల కోట్ల పెట్టుబడులకు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ఆమోదం తెలిపింది. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు మరో నాలుగు సంస్థలు ముందుకు రాగా.. ఆ ప్రతిపాదనలకు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. సిఫి, సత్వా, ఎఎన్ఎస్ఆర్, బివిఎం సంస్థలు రాష్ట్రంలో రూ.20,216 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ పెట్టుబడుల ద్వారా 50,600 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం చెప్తోంది. సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ విశాఖపట్నంలో సుమారుగా రూ. 16 వేల కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది.సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ విశాఖపట్నంలో మొదటిదశలో రూ.1,466 కోట్ల పెట్టనుండగా.. దీని ద్వారా 200 మందికి ఉపాధి లభించనుంది. ఇక రెండో దశలో రూ.15,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఈ పెట్టుబడులతో 400 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. సిఫీ టెక్నాలజీస్.. ఇన్ఫర్మేషన్, కమ్యూని కేషన్ టెక్నాలజీకి సంబంధించి సొల్యూషన్స్, సర్వీసెస్ ప్రొవైడర్‌గా పనిచేస్తుంది. సిఫీ దశల వారీగా ఏపీలో తమ సంస్థను ఏర్పాటు చేయనుంది. ఈ ఏడాది అక్టోబర్‌లో కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. మధురవాడలో సాత్వా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 1,500 కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టనుంది. దీని ద్వారా 25,000 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. రెసిడెన్షియల్, కమర్షియల్ ఐటీ, ఐటీఈఎస్ పార్కులకు సంబంధించిన ప్రాజెక్టులను అభివృద్ధిలో ఈ సంస్థకు అనుభవం ఉంది. ప్రస్తుతం 8 నగరాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది.

ఎండాడలో బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,250 కోట్ల పెట్టుబడులు పెట్టనుండగా.. దీని ద్వారా 15 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. కపిల్ గ్రూపునకు చెందిన బీవీఎం.. విశాఖ పట్నంలో మినీ స్మార్ట్ టెక్ సిటీ ఏర్పాటు చేయనుంది. ఆఫీస్ స్పేస్, కోవర్కింగ్ స్పేస్, ఎంప్లాయీ రెసిడెన్సెస్ వంటివి ఈ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ మధురవాడలో వేయి కోట్లు పెట్టుబడి పెట్టనుండగా..10,000 ఉద్యోగావకాశాలు వస్తాయి. ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు.. డిజైనింగ్, ఎస్టాబ్లిషింగ్, జీసీసీ ఆపరేటింగ్‌లో అనుభవం ఉంది. ఇండియాతో సహా పోలాండ్, యూఏఈలో కూడా కార్యకలాపాలు సాగిస్తోంది.మరోవైపు కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకూ జరిగిన ఎస్ఐపీబీ సమావేశాల్లో 113 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తంగా రూ.5,94,454 కోట్ల విలువైన పెట్టు బడులు ఏపీకి రానున్నాయి. అలాగే 5,56,568 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని ప్రభుత్వం వెల్లడించింది.

# కొలికపూడి యూ టర్న్



**విజయవాడ - సూర్యా వాస్తవం:** రాజకీయాలు ఎప్పుడు ఒకే విధంగా ఉండవు. ఒకే విధంగా ఉంటే అవి రాజకీయాలు కావు.. అప్పటిదాకా పరస్పర విమర్శలు చేసుకున్న వారు కలిసిపోతారు. అప్పటిదాకా కలిసి ఉన్న నాయకులు విడిపోతారు.. అందువల్లే రాజకీయాలను ఎవరూ స్పష్టంగా అంచనా వేయలేరు. ఇలానే జరుగుతుందని చెప్పలేరు. ఇందుకు ఉదాహరణే ఇది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం గత ప్రభుత్వ తప్పులను వెలికి తీసే పనుల్లో కూటమి ప్రభుత్వం పడింది. ఇందులో భాగంగానే అక్రమాలకు పాల్పడ్డారంటూ కొంతమంది నేతలను కూటమి ప్రభుత్వం అరెస్టు చేయించింది.. అందులో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు ఒకరు. పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి కుమారుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. అయితే లిక్కర్ కుంభకోణంలో ఆయన ప్రధాన పాత్రధారి అని.. వేల కోట్లను వేరే వైపు మళ్ళించారని ఆరోపిస్తూ ప్రత్యేక దర్యాప్తు బృందం అభియోగాలు నమోదు చేసింది.. దీనికోసం బలమైన సాక్షాలను.. బలమైన ఆధారాలను కోర్టు ముందు ప్రవేశపెట్టింది. న్యాయమూర్తి అనుమతితో ఆయనను రిమాండ్ కు తరలించింది.

ప్రస్తుతం మిధున్ రెడ్డి రాజమండ్రి జైల్లో ఉన్నారు. ఆయనను పరామర్శించడానికి తండ్రి రామచంద్ర రెడ్డి రాజమండ్రి వచ్చారు. రామచంద్ర రెడ్డి రాజమండ్రి విమానాశ్రయంలో ఉండగా ఆయనను టిడిపి ఎమ్మెల్యే కోలికపూడి శ్రీనివాసరావు కలిశారు. ఈ సందర్భంగా వారు ఇద్దరు కాసేపు మాట్లాడుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాలలో సందడి చేస్తోంది. కొలికపూడి శ్రీనివాసరావు ఏం మాట్లాడారు? దానికి రామచంద్రారెడ్డి ఏం చెప్పారు? అసలు వీరిద్దరికి మాట్లాడుకోవాల్సిన అవసరం ఏం వచ్చింది? కొలికపూడి శ్రీనివాసరావు పార్టీ మారుతున్నారా? అనే ప్రశ్నలు ప్రస్తుతం ఏపీ రాజకీయాలలో చక్కర్లు కొడుతున్నాయి.ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి కొలికపూడి శ్రీనివాసరావు వివాదాస్పద పనులు చేస్తున్నారు. వివాదాలు కు కేంద్ర బిందువుగా మారారు. దీంతో ఆయనపై టిడిపి అధిష్టానం ఆ గ్రహంగా ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. గతంలో కొలికపూడి శ్రీనివాసరావు టిడిపి ఆస్థాన మీడియాలో కనిపించేవారు. ఆయన విశ్లేషకుడిగా దర్శనమిచ్చేవారు. ఎప్పుడైతే టిడిపి అధిష్టానం ఆయన మీద ఆగ్రహంగా ఉందో.. అప్పటినుంచి శ్రీనివాస రావును టిడిపి ఆస్థాన మీడియా పక్కన పెట్టింది. మరోవైపు ఆయనపై వ్యతిరేకంగా కథనాలను ప్రచురిస్తోంది. ప్రసారం కూడా చేయిస్తోంది. ఇదే నేపథ్యంలో వైసీపీకి అనుకూలంగా ఉండే మీడియా శ్రీనివాసరావుకు పాజిటివ్ వార్తలు రాస్తూ ఉండడం విశేషం. అయితే అప్పట్లోనే శ్రీనివాసరావు వ్యవహార శైలి వేరే విధంగా ఉండడంతో ఆయన తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారని వార్తలు వినిపించాయి. అయితే ఆ తర్వాత అలాంటిది ఏమీ లేదని సంకేతాలు ఇవ్వడంతో ఆయన ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి శ్రీనివాసరావు నియోజకవర్గంలో అనేక వివాదాస్పద పనులకు పాల్పడ్డారు. ఒక అధికారి విషయంలో ఆయన అత్యుత్సాహాన్ని ప్రదర్శించారని ఆరోపణలు వినిపించాయి.


దీనిపై అధిష్టానం ఆయన నుంచి వివరణ కోరినట్టు వార్తలు వినిపించాయి.. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ శ్రీనివాసరావ్ విషయంలో టిడిపి అధిష్టానం కాస్త మెత్తబడినట్టు సమాచారం.. మళ్ళీ ఇన్ని రోజులకు శ్రీనివాసరావు వార్తల్లో వ్యక్తిగా నిలిచారు. ఏకంగా వైసిపిలో కీలక నాయకుడిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. పైగా పెద్దిరెడ్డి మిథన్ రెడ్డి జైల్లో ఉండడం.. కూటమి ప్రభుత్వం రామచంద్ర రెడ్డి పై ఆగ్రహంగా ఉన్న ప్రస్తుత తరుణంలోనే కొలికపూడి శ్రీనివాసరావు ఆయనను కలవడం విశేషం.. అయితే టిడిపి అధిష్టానం ఆగ్రహంగా ఉన్న నేపథ్యంలో శ్రీనివాసరావు పార్టీ మారతారని చర్చ నడుస్తోంది. అందువల్లే రామచంద్ర రెడ్డి తో మంతనాలు జరుపుతున్నారని.. జగన్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఫ్యాన్ కండువా కప్పుకోవడం ఖాయమని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇంతవరకు శ్రీనివాసరావు వర్గీయులు ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. కొద్దిరోజులుగా వారు మౌనంగానే ఉంటున్నారు. మరోవైపు శ్రీనివాసరావు స్థానికంగా ఉన్న టిడిపి క్యాడర్ కు దూరంగా ఉంటున్నట్టు వార్తలు వస్తున్నాయి.ఈ ప్రకారం చూసుకుంటే శ్రీనివాసరావు పార్టీ మారడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# త్వరలో వ్యవసాయ యంత్రాల సర్వే



**అమరావతి బ్యూరో -సూర్యా వాస్తవం, జూలై 27:** రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ యంత్రాల సర్వేను త్వరలో ప్రారంభించనున్నట్లు ఆ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఈ సర్వేను రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులు నిర్వహించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రైతులు, ఎఫ్‌పిఒలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ప్రైవేటు సంస్థల వద్ద ఉన్న యంత్రాలను సర్వే చేస్తారన్నారు. రాయితీపై లేక సొంత ఖర్చుతో కొనుగోలు చేసిన యంత్రాలైనా సర్వేలో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో వివరాల ఆధారంగా పంట విస్తీర్ణం, పంట కాలం ఆధారంగా గ్రామ స్థాయిలో అవసరమయ్యే వ్యవసాయ యంత్రాల లభ్యతను అంచనా వేయనున్నట్లు చెప్పారు. మూస ధోరణిలో కేటాయింపు విధానం కాకుండా, గ్రామ అవసరాల ఆధారంగా ప్రత్యేక బడ్జెట్ ప్రణాళికలు రూపొందించేందుకు ఈ సర్వే దోహదం చేస్తోందన్నారు.సర్వేలో నమోదు చేసిన వివరాలు వ్యవసాయ సమాచార యాజమాన్య వ్యవస్థ (ఎఫ్ఎంఐఎస్)లో ఎనాలసిస్ చేసి ఫలితాల ఆధారంగా యంత్రాల ప్రణాళిక, పర్యవేక్షణ, బడ్జెట్ కేటాయింపులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇ-సిహెచ్‌సి ఫ్లాట్‌ఫాంలో ఈ సర్వే సమాచారాన్ని అనుసంధానం చేసి, రైతులు యంత్రాలను ఉబెర్ తరహాలో బుక్ చేసుకునే విధానాన్ని అమలు చేయడంపై దృష్టి కేంద్రీకరించామని తెలిపారు.

## జిల్లాల పేర్లు మార్పుపై కేబినెట్ సబ్‌కమిటీ




**విజయవాడ-సూర్యా వాస్తవం:** ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పేర్లు మార్పుపై కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు అయింది.సభ్యులుగా మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, అనిత, జనార్ధన్‌రెడ్డి, రామానాయుడు, నాదెండ్ల, సత్యకుమార్ ఉంటారు. ప్రజల విజ్ఞప్తులపై సమగ్ర అధ్యయనం చేసి కమిటీ నివేదిక సమర్పిస్తుంది. సబ్ కమిటీ నివేదిక ఆధారంగా జిల్లాల మార్పుపై నిర్ణయం తీసుకుంది. ప్రాంతీయ హక్కులకు ప్రాధాన్యత ఇవ్వాలని సబ్ కమిటీకి ప్రభుత్వం సూచించింది.జిల్లాలు, మండలాలు, గ్రామాల పేర్ల మార్పు, సరిహద్దుల సవరణలపై ప్రజల నుండి సూచనలు, విజ్ఞప్తులను కమిటీ సేకరిస్తుంది.

ప్రజల అభిప్రాయాలను, చారిత్రక, సాంస్కృతిక, ప్రాంతీయ అంశాలను పరిగణనలోకి తీసుకొని సమగ్ర అధ్యయనం చేస్తుంది. అధ్యయనం ఆధారంగా సమగ్ర నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి కమిటీ సమర్పిస్తుంది. ప్రభుత్వం సూచించినట్లు, ప్రాంతీయ గుర్తింపు, సాంస్కృతిక విలువలు, చారిత్రక నేపథ్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి సిఫారసులు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో 2022లో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం 13 జిల్లాలను 26 జిల్లాలుగా పునర్విభజన చేసింది. ఈ జిల్లాల పేర్లు, సరిహద్దులు కొన్ని వివాదాస్పదంగా మారాయి. కొన్ని జిల్లాల పేర్లు, మండలాల సరిహద్దులపై స్థానికుల నుండి అభ్యంతరాలు, సూచనలు వచ్చాయి. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, పారదర్శకంగా, చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతలకు అనుగుణంగా జిల్లాల పేర్లు, సరిహద్దులను మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజల నుండి సేకరించిన అభిప్రాయాలను పారదర్శకంగా పరిశీలించి, నిర్ణయాలు తీసుకోవాలని కమిటీకి సూచించారు.కమిటీ నిర్దిష్ట సమయంలో నివేదిక సమర్పించేలా చర్యలు తీసుకోనున్నారు. కమిటీ ప్రజల నుండి సేకరించిన సూచనలు, అధ్యయనాల ఆధారంగా నివేదిక సిద్ధం చేస్తుంది. ఈ నివేదిక ఆధారంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జిల్లాల పేర్ల మార్పు, సరిహద్దుల సవరణలపై తుది నిర్ణయం తీసుకుంటుంది. నిర్ణయం తీసుకునే ముందు, ప్రజల అభిప్రాయాలను విస్తృతంగా సేకరించడం, చర్చిస్తారు. ఈ చర్యను ప్రజా భిప్రాయాన్ని గౌరవించే దిశగా ఒక అడుగుగా భావిస్తున్నారు.

## వైసీపీ నాయుడుపేట మున్సిపల్ సెక్రటరీ గోవా మాధవయ్యకు ఘన సన్మానం



**నాయుడుపేట -సూర్య వాస్తవం జూలై 27:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయుడుపేట మున్సిపాలిటీ కమిటీ సెక్రటరీగా ఇటీవల నియమితులైన జువ్వలపాలెం గ్రామానికి చెందిన గోవా మాధవయ్యకు మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం జువ్వలపాలెం గ్రామంలోని గోవా మాధవయ్య నివాసంలో మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైసిపి నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గోవా మాధవయ్యకు మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, నాయుడుపేట మున్సిపల్ కౌన్సిలర్ దువ్వూరు లక్ష్మీనారాయణ రెడ్డి, వైసిపి నాయకులు మారం రెడ్డి ముత్యాల రెడ్డి, పేర్నాటి రాహుల్,గోవా వంశీకృష్ణ, గోవా భరత్ కుమార్,గోవా మునికృష్ణయ్య, బిరదవాడ మల్లి కార్జున్, మల్లాం సుబ్రమణ్యం, అక్కుపల్లి హరిబాబు, గోవా శ్రీనివాసులు తది తరులు శాలువాలు కప్పి,పూలమాలలు వేసి, సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

## పంచాయతీ కార్యదర్శి యాస్మిన్‌కు నివాళి



**పెళ్లకూరు- సూర్యా వాస్తవం, జూలై 27:** పెళ్లకూరు మండల పరిధిలోని బంగారమ్మపేట గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఎండి. యాస్మిన్ అనారోగ్యంతో ఆదివారం అకాలంగా మృతి చెందడం విషాదం కలిగించింది. గత పదేళ్లుగా చావలి, పునాబాక గ్రామ పంచాయతీల్లో సేవల ందించిన ఆమె, సేవాపరతకు మారు పేరుగా పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం బంగార మ్మపేట పంచాయతీలో కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న యాస్మిన్ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె స్వస్థలమైన నాయుడుపేట పట్టణంలో జరిగిన అంత్యక్రియలకు ఎంపీడీవో ప్రమీల రాణి, పంచాయతీ సిబ్బంది హాజరై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంచితనానికి, ప్రజాసేవకు నిలువెత్తు ఉదాహరణగా నిలిచిన యాస్మిన్ మృతి పట్ల సహచరులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడు నాగేంద్ర రెడ్డి, గ్రామస్తులు, అధికార సిబ్బంది ఆమె కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. యాస్మిన్‌కు ఒక్క కుమారుడు ఉన్నాడు. ఆమె మృతి పట్ల పంచాయతీ సిబ్బందిలో బాధ కలకలం రేపింది. ఆమె చేసిన సేవలు చిరకాలం గుర్తుండిపోతాయని వారు తెలిపారు .

# తిరుమలలో దర్శన కష్టాలు



**తిరుమల-సూర్యా వాస్తవం:** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవుల అనంతరం కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. సోమవారం నాడు 77,481 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అందులో 30,612 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. ఆ ఒక్క రోజే హుండీ ద్వారా రూ.3.96 కోట్ల ఆదాయం సమకూరింది. ఆలయ ప్రాంగణంలోని అన్ని కంపార్ట్మెంట్లు భక్తులతో నిండిపోయాయి. టోకెన్ లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి 18 గంటల నుంచి 20 గంటల వరకు సమయం పట్టింది. కంపార్ట్మెంట్లు, క్యూలైన్లలో ఉన్న వారికి టీటీడీ సిబ్బంది, శ్రీవారి సేవకులు అన్నప్రసాదం, అల్పాహారం, పాలు, మంచినీరు పంపిణీ చేశారు. దర్శనానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించాలని టిటిడినిర్ణయించింది. ముఖ్యంగా టోకెన్ల జారీ ప్రక్రియను మరింత సులభతరం చేయాలని భావించింది. త్వరితగతిన శ్రీవారి దర్శన టికెట్లు దారి చేయడానికి వీలుగా తిరుమలలో కొత్తగా దర్శనం టికెట్ల కేంద్రం ఏర్పాటు చేసింది. దీని నిర్మాణం కోసం టీటీడీ 60 లక్షల రూపాయలను ఖర్చు చేసింది. తిరుమల అన్నమయ్య భవనం ఎదురుగా నూతన శ్రీవాణి దర్శన టికెట్ల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు దీనిని ప్రారంభించారు. భక్తుల కోసం ఈ కొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పుకొచ్చారు. మరోవైపు తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లు ఉన్నవారికి.. సిఫారసు లేఖలతో గదులు ఇవ్వడం ఇకపై కుదరదు. టీటీడీ ఈ విధానాన్ని రద్దు చేసింది. ఈ స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లకు సంబంధించి భక్తులు తిరుపతిలోని విష్ణు నివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్ లలో పొందుతారు. వీరు నేరుగా దర్శనానికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే చాలామంది సిఫారసు లేఖలతో గదులు పొందుతున్నారు. ఇది మిగతా భక్తులకు ఇబ్బందికరంగా మారుతోంది. అందుకే టీటీడీ ఈ నిర్ణయం తీసుకుంది. తిరుమల శ్రీవారి దర్శనం కోసం 300 రూపాయల టికెట్లు ఉన్న సుదూర ప్రాంత భక్తులకు మాత్రమే సిఫారసు లేఖలపై గదులు ఇస్తారు. అయితే శ్రీవాణి టిక్కెట్లు పొందిన భక్తులు రెండు మూడు గదులు తీసుకుంటున్నారు అన్న ఫిర్యాదులు ఉన్నాయి. అందుకే ఇప్పుడు కుటుంబ సభ్యుల సంఖ్యను బట్టి మాత్రమే గదులు కేటాయించనున్నారు.

# ఆంధ్రాలో అమ్మలకే... 1500

**ఏలూరు-సూర్యా వాస్తవం:** న్నికల హామీలపై దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్కో హామీని అమలు చేయడం ప్రారంభించింది. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ మొత్తాన్ని నాలుగు వేల రూపాయలకు పెంచింది. అటు తరువాత అన్న క్యాంటీన్లను తెరిచింది. గత ఏడాది దీపావళి నాడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని ప్రారంభించింది. అయితే ఆ మూడు చేసినా ప్రజల్లో సంతృప్తి కనిపించలేదు. ఆ మూడు హామీలు సూపర్ సిక్స్ పథకంలో ఉన్నవే. అయితే ఈ ఏడాది తల్లికి వందనం పథకం అమలు చేసింది. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి పథకాన్ని వర్తింపజేసింది. అన్నదాత సుఖీభవ అమలు చేసేందుకు కసరత్తు పూర్తి చేసింది. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ పథకం ప్రారంభించనుంది. అయితే ఇలా మొత్తం పథకాలు అమలవుతున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం పై ఆర్థిక భారం పడుతోంది. అదే సమయంలో విపక్షాలు ఈ పథకాల్లో ఉన్న లోపాలను ఎత్తిచూపుతున్నారు. మిగతా పథకాల మాట ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు పథకాలు అమలు చేసి ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే.. ఈ సరికొత్త డిమాండ్లపై రుసరసలాడుతున్నారు ఏపీ మంత్రులు. తాజాగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కీలకమైన ఓ పథకం విషయంలో నోరు జారారు. టిడిపి కూటమి అధికారంలోకి వస్తే ఇంట్లో 18 సంవత్సరాలు దాటిన మహిళలకు నెలకు 1500 రూపాయల ఆర్థిక సాయం అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాల్లో ప్రధానమైనదిగా చెప్పుకొచ్చారు. ఆడబిడ్డ నిధి పథకం కింద ఈ సాయాన్ని ఏడాదికి 18 వేల రూపాయలు అందిస్తామని హామీ ఇచ్చారు. అప్పట్లో వైసిపి ప్రభుత్వం మహిళలకు ఏడాదికి 18 వేల రూపాయలు అందించిన సంగతి తెలిసిందే. దానికి పూర్తిగా టిడిపి ఎన్నికల్లో ఇంట్లో ఎంత మంది మహిళలు ఉంటే అంతమందికి ఈ పథకం వర్తింప చేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ హామీని అమలు చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది. అయితే దీనిపై తాజాగా స్పందించారు ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు. ఈ పథకాన్ని అమలు చేయాలంటే ఏపీ ని అమ్మాల్సి ఉంటుందని అన్నారు. ఓ బహిరంగ సభలో ఈ ప్రకటన చేయడంతో అక్కడ ఉన్న వారు షాక్ కు గురయ్యారు. అయితే ఇంతలోనే చేరుకున్న ఆయన ఒక్కసారిగా నవ్వేయడంతో అక్కడ నవ్వులు విరిసాయి. అయితే ఆడబిడ్డ నిధి పథకానికి సంబంధించి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు ఇటీవల ప్రకటించారు. పేదరిక నిర్మూలన కోసం పి4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. అత్యంత నిరుపేద కుటుంబాలను పైకి తేవాలన్న ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేశారు. ఆర్థికంగా ఉన్నవారు.. నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని ఈ పథకం ముఖ్య ఉద్దేశం. అయితే ఆ పథకంలో ఈ ఆడబిడ్డ నిధి పథకాన్ని విలీనం చేసి అమలు చేస్తామని చంద్రబాబు ఒక నిర్ణయానికి వచ్చారు. అంటే మార్గదర్శకుల రూపంలో ఉన్నతశ్రేణి వర్గాల నుంచి సాయం తీసుకుని.. నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలన్నదే దీని ప్లాన్. అయితే ఇలా దత్తత తీసుకున్న నిరుపేదల కుటుంబాల్లో 18 సంవత్సరాలు నిండిన మహిళలకు ఆ నిధుల సర్దుబాటుకు నిర్ణయించారు. అయితే రాష్ట్ర క్యాబినెట్ లోని ఓ మంత్రి ఇలా పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని అనడం మాత్రం విస్తు గొలుపుతోంది. అటువంటిప్పుడు హామీ ఎందుకు ఇవ్వాలన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.



# లిక్కర్ కథ చాలా ఉంది...



**విజయవాడ -సూర్యా వాస్తవం:** ఏపీలో మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టిస్తోంది. దేశంలోనే అతిపెద్ద కుంభకోణం అని కూటమి ప్రభుత్వం చెబుతోంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం కొట్టి పారేస్తోంది. ఇది రాజకీయ ప్రేరేపిత కుట్ర కేసుగా అభివర్ణిస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు చూస్తే మాత్రం తప్పనిసరిగా మద్యం కుంభకోణం జరిగి ఉంటుందని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. ఒకప్పటి వైసిపి కీలక నేత విజయసాయిరెడ్డి సైతం మద్యం కుంభకోణం జరిగిందని ఆరోపించారు. హైదరాబాద్ కేంద్రంగా సిట్టింగులు కూడా జరిగాయని.. అందులో తాను సైతం పాల్గొన్నానని.. తనకు మాత్రం సంబంధం లేదని ఆయన చెప్పుకొచ్చిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఎంపీ మిధున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. అదే సమయంలో ఈ కేసుకు సంబంధించి తొలి చార్జ్ షీట్ ను కోర్టుకు సమర్పించింది ప్రత్యేక దర్యాప్తు బృందం. ఒకటి కాదు రెండు కాదు మూడు 3,500 కోట్ల రూపాయల కుంభకోణం ఇది అని తేల్చేసింది. త్వరలో అంతిమ లబ్ధిదారుడు ఎవరు అనేది తెలుస్తామని కూడా స్పష్టం చేసింది. 20 రోజుల్లో మరో చార్జిషీట్ దాఖలు చేస్తామని చెప్పింది. వాస్తవానికి 2019 ఎన్నికల్లో మద్య నిషేధం హామీ ఇచ్చారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి. నవరత్నాల్లో భాగంగా సంపూర్ణ మద్యపాన నిషేధానికి హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా దశలవారీగా దుకాణాలను మూసివేస్తామని చెప్పి.. స్వయంగా ప్రభుత్వమే నడిపే విధంగా మద్యం పాలసీని అమాంతం మార్చారు. అక్కడే మద్యం కుంభకోణానికి బీజం పడింది. ఎక్కడో కేంద్రం సర్వీసులో ఉన్న అధికారిని తెచ్చి మద్యం పాలసీని తయారు చేసే బాధ్యతలు అప్పగించారు. 2019 ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన రాజ్ కసిరెడ్డిని తెచ్చి సూత్రధారిగా మార్చారు. ఎంపీ మిధున్ రెడ్డి తెర వెనుక ఉండి నడిపించారు. మద్యం తయారీదారులతో పాటు డిస్టలరీలను తమ అదుపులోకి తెచ్చుకున్నారు. నాసిరకం మద్యం తయారీని ప్రోత్సహించారు. తద్వారా ప్రతీ సీసాకు కమిషన్ ఇంతా అని నిర్దేశించారు. అప్పటివరకు ఉన్న ప్రీమియం మద్యం బ్రాండ్లు కనిపించకుండా పోయాయి. చాలా రకాల కొత్త బ్రాండ్లు కనిపించాయి. దేశవ్యాప్తంగా వినిపించని బ్రాండ్లు సైతం ఏపీలో దర్శనం ఇవ్వడం విశేషం. షాపులు నడిపేది ప్రభుత్వం.. మద్యం కంపెనీలు వైసీపీ నేతలువి.. డిస్టలరీలు వారి కంట్రోల్ లోనే ఉండేవి.. కేవలం మద్యం పాలసీ మారింది. కానీ నడిపేది వైసిపి నేతలు. లబ్ధి పొందింది వారే. కానీ నాసిరకం మద్యంతో ప్రజారోగ్యానికి తీరని భంగం వాటిల్లింది. దాదాపు 30 వేల మందికి పైగా నాసిరకం మద్యానికి బలయ్యారని ఆరోపణలు కూడా బలంగా వినిపించాయి. అయితే మద్యం కుంభకోణంలో ప్రధాన సూత్రధారి రాజ్ కసిరెడ్డి కానీ ఆయన వెనుక ఉండి నడిపించింది అంతా పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి అని ప్రత్యేక దర్యాప్తు బృందం గుర్తించింది. కల్తీ మద్యం ద్వారా సంపాదించిన సొమ్ముతో బంగారం వ్యాపారం, రియల్ ఎస్టేట్ లావాదేవీలు జరపడం, విదేశాల్లో మైనింగ్ వంటివి చేశారని గుర్తించింది సిట్. మద్యం పాలసీలో కీలక పాత్ర పోషించారు అప్పటి బేవరేజస్ చైర్మన్ వాసుదేవ రెడ్డి. వాస్తవానికి ఆయన ఈ రాష్ట్రానికి చెందిన అధికారి కాదు. ఐఆర్ఎస్ అధికారిగా ఉండేవారు. ఆయనను డిప్యూటేషన్ పై తీసుకొచ్చి అస్మదీయ అధికారిగా మార్చేశారు. ఎక్సైజ్ శాఖ అధికారిగా ఉన్న సత్య ప్రసాద్ ని కన్వర్టెడ్ ఐఏఎస్ గా పదోన్నతి కల్పిస్తామని ప్రలోభ పెట్టారు. వారిద్దరిని పావుగా మార్చుకొని దోపిడీకి పాల్పడింది మాత్రం మిధున్ రెడ్డి అని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో తేలినట్లు తెలుస్తోంది. మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారు ఎవరు అన్నది బహిరంగ రహస్యమే. కానీ ఈ బృందంలో ఎక్కువ లాభ పడింది మాత్రం పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి ప్రతి నెలా 5 కోట్ల రూపాయల వరకు మిధున్ రెడ్డికి వాటాల రూపంలో వెళ్లేవని తెలుస్తోంది. ఆయన కుటుంబీకులు డైరెక్టర్లు గా ఉన్న పి ఎల్ ఆర్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ ఖాతాల్లో ఆ నగదును జమ చేసుకున్నట్లు తేలింది. అయితే ఒక పద్ధతి ప్రకారం మద్యం కుంభకోణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. కేవలం నగదు అమ్మకాలకు మాత్రమే ప్రోత్సహించారు. గూగుల్ పే, ఫోన్ పే వంటి డిజిటల్ లావాదేవీలు పైకి చూపి.. నగదు అమ్మకాల ద్వారా కుంభకోణానికి తెరలేపినట్లు సిట్ విచారణలో స్పష్టమైంది. మరోవైపు మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడు కీలక నేత అయితే.. అంతిమంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకిలబ్ధి చేకూర్చాలని భావించినట్లు సీట్ చెబుతోంది. మద్యం కుంభకోణం ద్వారా సంపాదించిన సొమ్మును 2024 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులకు పంచాలని ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. ఈ కేసులో 40 మంది నిందితులు ఉండగా.. ఇప్పటివరకు అరెస్టయిన 12 మంది మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితులు. వీరే ఈ మద్యం కుంభకోణంలో కీలక పాత్ర పోషించారు. మద్యం ద్వారా వచ్చిన ఆదాయంతో ఇతర వ్యాపారాలు చేశారు. అదే సొమ్మును హవాలా రూపంలో విదేశాలకు తరలించి మైనింగ్ వ్యాపారాన్ని చేపట్టారు. ఇలా దోచేసిన సొమ్మును 175 నియోజకవర్గాలకు పంపించి మరోసారి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలిచేందుకు వ్యూహరచన చేశారు. అయితే వీరు ఒకటి తలిస్తే దైవము ఒకటి తలచినట్టు.. ప్రజా తీర్పు తారుమారు కావడంతో.. ఏపీలో అధికారం మార్పిడి కావడంతో అడ్డంగా బుక్ అయినట్లు తెలుస్తోంది. మొత్తానికి అయితే అంతిమ లబ్ధిదారుడు ఎవరు? ఆ సొమ్ముతో ఏం చేయదలుచుకున్నారో ఏపీ ప్రజలకు స్పష్టంగా తెలిసింది. ఈ విషయంలో మాత్రం ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణకు హాట్సాఫ్ చెప్పాల్సింద

# ఫ్రీ బస్సులకు చకచకా ఏర్పాట్లు

**అమరావతి - సూర్యా వాస్తవం:**
ఎన్నికల హామీలపై దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వ. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న క్రమంలో సంక్షేమ పథకాలపై ఫుల్ ఫోకస్ చేసింది. ఇప్పటికే తల్లికి వందనం పథకం అమలు చేసింది. విద్యా సంవత్సరం ప్రారంభం రోజున ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఈ పథకం వర్తింపజేసింది. మరోవైపు తల్లికి వందనం రెండో విడత నిధులు కూడా జమ చేసింది. ఒకటో తరగతి ప్రవేశాలు పొందిన విద్యార్థులతో పాటు ఇంటర్లో చేరిన వారికి సైతం నిధులు జమ చేసింది. అంతటితో ఆగకుండా వివిధ సాంకేతిక కారణాలతో ఈ పథకం నిలిచిపోయిన వారికి సైతం తప్పులు సరిచేసి అందించింది కూటమి ప్రభుత్వం. ఇదే స్ఫూర్తితో అన్నదాత సుఖీభవ పథకానికి సైతం అన్ని ఏర్పాట్లు చేసింది.

మరోవైపు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణానికి సంబంధించి పథకానికి కూడా కసరత్తు ప్రారంభించింది. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు తాజాగా ప్రకటించింది. ఈరోజు ఈ పథకానికి సంబంధించి సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్ష జరిపారు. ఈ పథకానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏపీలో ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలోఉచిత ప్రయాణ పథకం ప్రారంభం కానుంది. అయితే ఈ పథకానికి సంబంధించి మహిళలకు జీరో పేరో టికెట్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఎక్కడ నుంచి ఎక్కడకు ప్రయాణం చేస్తున్నారు? ఉచిత ప్రయాణంతో వారికి డబ్బులు ఎంత ఆదా అయ్యాయి? 100% ప్రభుత్వం ఇస్తున్న రాయితీ వంటి వివరాలు ఆ





టిక్కెట్లు ఉండాలని స్పష్టంగా చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు.

అంటే ఆర్టీసీలోప్రయాణించే ప్రతి మహిళకు జీరో ఫెయిర్ టికెట్ ఇవ్వడం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న లబ్ధి, దాని ద్వారా ఎలా ప్రయోజనం చేకూరుతుంది అనేది వారికి స్పష్టమయ్యే అవకాశం ఉంది. కేవలం ఆధార్ కార్డుచూపిస్తే ఉచిత ప్రయాణం కల్పిస్తే మహిళలకు ప్రభుత్వం ఉదారత అర్థమయ్యే అవకాశం లేదు. అందుకే వారికి ఇచ్చే జీరో ఫేర్ టిక్కెట్ పై అన్ని వివరాలు పొందుపరచాలని నిర్ణయించారు. ఎందుకు సంబంధించి ప్రత్యేక సాఫ్ట్వేర్ రూపొందించాలని ఆదేశించారు సీఎం చంద్రబాబు. ఈరోజు సచివాలయంలో మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకం పై అధికారులతో సీఎం సమీక్షించారు. ఈ పథకంతో రాష్ట్ర ప్రభుత్వం పై ఎంత భారం పడనుంది? ఎంతమంది మహిళలు ప్రయాణించే అవకాశం ఉంది? అదనంగా ఎన్ని బస్సులు అవసరం అవుతాయి? అన్న విషయాలపై అధికారులతో చర్చించారు. హామీఇచ్చిన మాదిరిగానే ఆగస్టు 15 నుంచి సమర్థవంతంగా ఈ పథకాన్ని అమలు చేస్తామని సీఎం చంద్రబాబు. అయితే మహిళలకు ఉచిత ప్రయాణ పథకంతో ఆర్టీసీ పై పెను ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది ఏపీఎస్ఆర్టీసీ. అందుకే ఇతర ఆదాయ మార్గాలు పెంపొందించుకోవడం, నిర్వహణ వ్యయం తగ్గించుకోవడం వంటి వాటిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు ఏపీ సీఎం చంద్రబాబు. ఎందుకుగాను ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రానిక్ బస్సులు అందుబాటులోకి వస్తాయని ప్రస్తావించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున. ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. మొత్తానికైతే ఆగస్టు 15 నుంచి ఏపీలో మహిళలకు ఉచిత ప్రయాణానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నమాట

# కార్మిక సమ్మెతో ఆశా వర్కర్లకు ప్రోత్సాహకాలు పెంపు

**న్యూఢిల్లీ - సూర్యా వాస్తవం, జూలై 27:**
ఈ నెల 9న జరిగిన కార్మిక సమ్మెతో ఆశా వర్కర్లకు ప్రోత్సాహకాలు పెంచారు. ఇది సార్వత్రిక సమ్మె విజయమని ఆశా వర్కర్ల యూనియన్ ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ పేర్కొంది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిపి ప్రేమ, మధుమితా బందోపాధ్యాయ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఆశా వర్కర్ల నిరంతర పోరాటాలు, జులై 9 సార్వత్రిక సమ్మెతో కేంద్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల ప్రోత్సాహకాల పెంపును ప్రకటించాల్సి వచ్చిందన్నారు. పార్లమెంట్లో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ సమాధానం ఇస్తూ.. ఆశా వర్కర్లకు రూ.3,500 ప్రోత్సాహకాన్ని పెంచినట్లు తెలిపారని పేర్కొన్నారు. జులై 9న కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యలు నిర్వహించిన విజయవంతమైన అఖిల భారత సార్వత్రిక సమ్మె దాదాపు 80 శాతం మంది ఆశా కార్మికులు పాల్గొన్నారని తెలిపారు. ఇది దేశంలోని ఆశా కార్మికులు, సహాయకుల స్థిరమైన పోరాటాలకు స్పష్టమైన విజయమని అన్నారు. ఆశా వర్కర్లు, ఫెసిలిటేటర్ల ఐక్య పోరాటాలకు అభినందనలు తెలిపారు. ఆగస్టు 18న కేరళలోని తిరువనంతపురంలో జరిగే జాతీయ ర్యాలీలో ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తుందన్నారు.



# పవన్ వీరమల్లు చేయడానికి కారణమిదేనా?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓ వైపు రాజకీయాల్లో బిజీగా ఉంటూనే మరోవైపు సినిమాలు కూడా చేస్తూ తన అభిమానుల్ని అలరిస్తూ వస్తున్నారు. అందులో భాగంగానే తాను కమిట్ అయిన సినిమాలన్నింటినీ వరుస పెట్టి చేసుకుంటూ వెళ్తున్న పవన్, రీసెంట్‌గా హరి హర వీరమల్లు సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. అర్థవంతమైన సినిమాలపై పవన్ ఫోకస్ జులై 24న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాకు ఆడియన్స్ నుంచి మిక్స్డ్ రెస్పాన్స్ వస్తోంది. అయితే ఈ సినిమా ఫలితాన్ని పక్కన పెడితే పవన్ కళ్యాణ్ అసలెందుకు ఈ సినిమా చేశారనేది ఒకసారి చూద్దాం. పవన్ కళ్యాణ్ ఎప్పుడూ మంచి కథలనే ఎంచుకుంటారు. అందులోనూ రాజకీయాల్లోకి వద్దామనుకున్నప్పటి నుంచి పవన్ దృష్టంతా అర్థవంతమైన సినిమాల పైనే ఉంది. హరి హర వీరమల్లు సినిమా కూడా అలాంటి అర్థవంతమైన చిత్రమే. వీరమల్లు సినిమా కేవలం వినోదాన్ని అందించడమే కాకుండా అందులో ఆడియన్స్ ను ఎడ్యుకేట్ చేసే సబ్జెక్ట్ కూడా ఉంది.

ఇండియన్ హిస్టరీలో, సనాతన ధర్మంలో పెద్దగా చర్చకు రాని పాయింట్ ను వీరమల్లు లో బాగా హైలైట్ చేశారు. అదే జిజియా పన్ను భారం. 16వ శతాబ్దపు బ్యాక్ డ్రాప్ కు వ్యతిరేకంగా రూపొందించబడిన వీరమల్లు సినిమా లో మొఘలుల పాలనలో మరీ ముఖ్యంగా ఔరంగజేబు రూలింగ్ లో ఉన్న సామాజిక వాతావరణాన్ని ఈ సినిమా కళ్లకు కట్టినట్టు చూపించింది. వీరమల్లులో హిందువులు ఎదుర్కొంటున్న అన్యాయాలు, జిజియా పన్ను గురించి ఎంతో బాగా చూపించడంతో పాటూ ఆ అంశాలను బాగా హైలైట్ కూడా చేశారు. కేవలం 16వ శతాబ్దం నేపథ్యంలో సినిమాను తీయడమే కాకుండా సినిమాలో పెద్ద పెద్ద ప్యాలెస్‌ల నుంచి ఆనాటి సాంప్రదాయ దుస్తుల విషయం వరకు ఎంతో జాగ్రత్త తీసుకున్నారు. సినిమాలో వీరమల్లుగా పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్ ఇవ్వడమే కాకుండా సినిమాలో ఎంతో కీలకమైన యాక్షన్ సీక్వెన్స్ కు కొరియోగ్రఫీ చేసే బాధ్యతను కూడా తీసుకున్న పవన్ కళ్యాణ్, అక్కడితో ఆగకుండా పొలిటికల్ లైఫ్ లో ఎంత బిజీగా ఉన్నా సినిమా ప్రమోషన్స్ లో కూడా భాగమయ్యారు. దీన్ని బట్టి చూస్తుంటే ఈ తరానికి పాత కాలపు వాస్తవాల గురించి అవగాహన పెంచడమే టార్గెట్ గా పవన్ వీరమల్లును చేసినట్టనిపిస్తోంది. ఎప్పుడో కరోనాకు ముందు క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో మొదలైన ఈ సినిమా ఎన్నో అవాంతరాలను ఎదుర్కొంది. మధ్యలో కొన్ని కారణాల వల్ల క్రిష్ ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోవడంతో ఏఎం జ్యోతి కృష్ణ ఆ బాధ్యతల్ని తీసుకుని సినిమాను పూర్తి చేశారు. నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటించిన ఈ సినిమాలో బాబీ డియోల్ ఔరంగజేబుగా నటించగా కీరవాణి ఈ సినిమాకు సంగీతం అందించారు.

# కేజీఎఫ్ - కల్కి టోన్‌తో 'కింగ్ డమ్'

**- సౌత్ సినిమాలో ఇటీవల వచ్చిన పెద్ద చిత్రాల్లో కేజీఎఫ్, కల్కి 2898 ఎడి చిత్రాలు చాలా ప్రభావం చూపాయి**

**-ఇప్పుడు గౌతమ్ తిన్ననూరి- విజయ్ దేవరకొండపైనా ఈ ప్రభావం కనిపిస్తోంది**



ఏదైనా సినిమాలో దృశ్యాలు మనల్ని వెంటాడుతున్నాయంటే అందులో చాలా విషయం ఉందనే అర్థం. సినిమా నచ్చితేనే అందులోని దృశ్యాలు వెంటాడతాయి.. అవి ఎప్పటికీ కళ్లలోనే ఉండిపోతాయి. ఏళ్ల తరబడి జ్ఞాపకాల్లోంచి తీసేయలేం. అంత గొప్ప ప్రభావం అరుదుగా కొన్ని సినిమాతోనే కుదురుతుంది. అవతార్, 300, గ్లాడియేటర్, అవెంజర్స్, సూపర్ మేన్ ఇవన్నీ ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉండటానికి వాటిలో విజువల్స్, పాత్రల చిత్రణ, కలర్ గ్రేడింగ్, బీజీఎం, యాక్షన్ పార్ట్ వగైరా వగైరా అంశాలు ఎన్నో ఉంటాయి. గెరార్డ్ బట్లర్ తెరకెక్కించిన వార్ బ్యాక్ డ్రాప్ సినిమా 300 ప్రభావం కొన్నేళ్ల పాటు ఫిలింమేకర్స్ మైండ్ పై పని చేసింది. అందులో రాజమౌళి కూడా ఉన్నాడు. బాహుబలికి స్ఫూర్తినిచ్చినది 300 మూవీ. ఆస్కార్ విన్నింగ్ గ్లాడియేటర్ ప్రభావం చాలా సినిమాలపై ఉంది. సౌత్ సినిమాలో ఇటీవల వచ్చిన పెద్ద చిత్రాల్లో కేజీఎఫ్, కల్కి 2898 ఎడి చిత్రాలు చాలా ప్రభావం చూపాయి. ఇప్పుడు గౌతమ్ తిన్ననూరి- విజయ్ దేవరకొండపైనా ఈ ప్రభావం కనిపిస్తోంది. తాజాగా రిలీజైన - కింగ్ డమ్- ట్రైలర్ చూడగానే కేజీఎఫ్‌లోని డార్క్ థీమ్, కల్కి 2898 ఎడిలోని గాంభీర్యం కనిపిస్తోంది. ఇందులో కూడా కేజీఎఫ్ నటులు ఉన్నారు. ఎంపిక చేసుకున్న బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కూడా కొంతవరకూ ఆ ప్రభావం చూపెడుతోంది. అనిరుధ్ రవిచందర్ బీజీఎం ఉత్సుకత పెంచుతోంది. ముఖ్యంగా అటవిక గ్యాంగ్ స్టర్ నేపథ్యం చూడగానే, ఇది మరో కేజీఎఫ్- కల్కి బ్లెండెడ్ ప్రపంచంలా విస్మయపరిచింది. విజువల్స్ లో కలర్ టోన్ చూడగానే కేజీఎఫ్, కల్కి ప్రభావం దర్శకుడిపై ఉందని అర్థమవుతోంది. మనసుపై బలమైన ముద్ర వేసే కలర్ గ్రేడింగ్, లొకేషన్ల ఎంపిక కనిపిస్తోంది. అయితే ఎప్పుడూ ఒక హిట్టయిన సినిమాని ఫిలింమేకర్స్ అనుకరించకూడదు. ఈ విషయంలో గౌతమ్ తిన్ననూరి చాలా కసరత్తు చేసి, కింగ్ డమ్ కథను ఎలివేట్ చేసాడని అర్థమవుతోంది. ఇది కూడా అన్నదమ్ములు కథ. అన్నను వెతుక్కుంటూ లంకకు వెళ్లే తమ్ముడి కథ. గ్యాంగ్ స్టర్ల మధ్య అతడు ఎలాంటి పోరాటం సాగించాడు? అనే కథను తెరపై చూపిస్తున్నారు. మాస్ యాక్షన్ కంటెంట్ కి తగ్గట్టు విజయ్ దేవరకొండ ఆహార్యం ఎంతగానో ఆకట్టుకుంటోంది. అయితే ట్రైలర్ తో కథను ఉద్దేశపూర్వకంగా లీక్ చేసారు కాబట్టి, సినిమాలోని ప్రతి ఫ్రేమ్ లో హై ఏంటో చూపించాల్సి ఉంటుంది. గౌతమ్ తిన్ననూరి పనితనాన్ని తెరపై వీక్షించాల్సి ఉంది.



# ఒకే రోజు మూడు శతకాలు

**- నాలుగో టెస్ట్ డ్రాగా ముగిసింది**



**మాంచెస్టర్:** భారత్- ఇంగ్లాండ్ మధ్య జరిగిన నాలుగో టెస్ట్ డ్రాగా ముగిసింది. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో ముగ్గురు సెంచరీలతో కదం తొక్కారు. దీంతో రెండో ఇన్నింగ్స్‌లో భారత్ ఐదో రోజు ఆట ముగిసే సరికి నాలుగు వికెట్ల నష్టానికి 425 పరుగులు చేసింది. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (103, 12 ఫోర్లు)- కేఎల్ రాహుల్ (90, 230 బంతుల్లో 8 ఫోర్లు) జోడీ తరువాత రవీంద్ర జడేజా (107, 185 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్) -వాషింగ్టన్ సుందర్ (101, 206 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) జంట సెంచరీలు చేసి భారత్‌ను గట్టెక్కించారు. ఆదివారం రెండు వికెట్ల నష్టానికి 174 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో భారత్ రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించింది. 188 పరుగుల వద్ద రాహుల్ మూడో వికెట్‌గా అవుటయ్యాడు. సెంచరీ తరువాత 222 పరుగులతో గిల్ నాలుగో వికెట్‌గా అవుటయ్యాడు. తరువాత జడేజా-సుందర్ జోడీ ఇంగ్లంగ్ బౌలర్లకు చుక్కలు చూపించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఖాతా ప్రారంభించకుండానే రెండు వికెట్లు.. (యశస్వి జైస్వాల్ (0), సాయి సుదర్శన్ (0)) కోల్పోయినప్పటికీ భారత్ వీరోచితంగా పోరాడింది.తొలుత రాహుల్- శుభ్‌మన్ జోడీ మూడో వికెట్‌కు రికార్డు స్థాయిలో 188 పరుగులు జోడించగా.. సుందర్-జడేజా జోడీ ఐదో వికెట్‌కు అజేయమైన 203 పరుగులు జోడించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 358, ఇంగ్లాండ్ 669 పరుగులకు ఆలౌటయ్యాయి. సౌందర్ శతకం చేసిన తర్వాత మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు అంపైర్లు ప్రకటించారు. మ్యాచ్ ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో 10 ఓవర్లు మిగిలుండగానే మ్యాచ్‌ను డ్రాగా ముగించేందుకు ఇరుజట్లు అంగీకరించాయి. ప్లేయర్ ఆఫ్ మ్యాచ్‌గా బెన్ స్టోక్స్ నిలిచాడు. నాలుగో టెస్ట్ డ్రా కావడంతో సిరీస్‌లో ఇంగ్లండ్ ఆధిపత్యం 2-1తో కొనసాగుతుంది. చివరిదైన ఐదో టెస్ట్ జులై 31 నుంచి లండన్‌లోని కెన్నింగ్టన్ ఓవల్‌లో ప్రారంభమవుతుంది. ఈ సిరీస్‌లో ఒకటి, మూడు మ్యాచ్‌లు ఇంగ్లండ్ గెలువగా.. భారత్ రెండో మ్యాచ్‌లో విజయం సాధించింది.

ఈ టెస్టులో ఇంగ్లండ్‌తో తొలి ఇన్నింగ్స్‌లో 669 పరుగులకు ఆలౌటైంది. జో రూట్ (150), బెన్ స్టోక్స్ (141) భారీ శతకాలతో కదంతొక్కగా.. జాక్ క్రాలే (84), బెన్ డకెట్ (94) సెంచరీలకు చేరువలో ఔటయ్యారు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 358 పరుగులకు ఆలౌటైంది.

# ఇక తేలేది టై బ్రేకర్‌లోనే

**- హంపి, దివ్య రెండో గేమ్ సైతం డ్రా ఫిడె మహిళల చెస్ ప్రపంచకప్**

**బటుమి (జార్జియా) :** ఫిడె మహిళల చెస్ క్వీన్ ఎవరనే ఉత్కంఠ కొనసాగుతోంది. భారత వెటరన్ గ్రాండ్‌మాస్టర్, తెలుగు తేజం కోనేరు హంపి, భారత యువ గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్‌లు ప్రపంచ చెస్ ప్రపంచకప్‌లో అమీతుమీ తేల్చుకుం టున్నారు. శనివారం జరిగిన తొలి గేమ్‌లో అటు హంపి, అటు దివ్యలు పొరపాటు చేసినా.. ఆది వారం జరిగిన రెండో గేమ్‌లో ఇద్దరూ ఎంతో జాగ్ర త్తగా ఎత్తులు వేశారు. తెల్ల పావులతో ఆడిన కోనేరు హంపి.. ఓ సమయంలో దివ్య నుంచి క్వీన్ ట్రేడ్‌ను తిరస్కరించినా.. ఆఖరుకు డ్రా ఆఫర్‌ను అంగీకరిం చింది. క్లాసికల్ ఫార్మాట్‌లో జరిగిన తొలి రెండు గేములు డ్రాగా ముగిశాయి. 1-1తో హింపి, దివ్య సమవుజ్జీలుగా నిలిచారు. చెస్ ప్రపంచకప్ విజేతను తేల్చేందుకు గేమ్ ఫార్మాట్ టైబ్రేకర్‌కు మారనుంది. వరుసగా ఏదేని రెండు టైబ్రేకర్లలో పైచేయి సాధించిన గ్రాండ్‌మాస్టర్ అంతిమ విజేతగా నిలువనుంది.

**34 ఎత్తుల్లోనే.. :** తొలి గేమ్ డ్రాగా ముగియగా.. రెండో గేమ్‌లో విజయం సాధిస్తే టైటిల్ సొంతం చేసుకునే అవకాశం ముందుండగా.. కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్‌లు ఆచితూచి ఆడారు. తీవ్ర ఒత్తిడిలోఎవరూ రిస్క్ తీసుకునే ప్రయత్నం చేయలేదు. దీంతో రెండో గేమ్ సాదాసీదాగా సాగింది. టెక్స్ట్‌బుక్ ఫార్మాట్ తరహాలో సాగిన మ్యాచ్‌లో తెల్ల పావులతో ఎత్తులు వేసిన కోనేరు హంపి.. 34 ఎత్తుల తర్వాత దివ్య దేశ్‌ముఖ్ డ్రా ప్రతిపాదనకు సమ్మతించింది. దీంతో ఇరువురు చెరో అర పాయింట్ ఖాతాలో వేసుకున్నారు. క్వార్టర్‌ఫైనల్ నుంచి మేటీ గ్రాండ్‌మాస్టర్లను మట్టికరిపించి టైటిల్ పోరుకు చేరుకున్న దివ్య దేశ్‌ముఖ్ అండర్‌డాగ్ ట్యాగ్‌తో సీనియర్ జీఎం హంపిని ఒత్తిడిలో పడేసేందుకు ప్రయత్నిస్తుంది. సెమీఫైనల్లో సహచర భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారికను టైబ్రేకర్‌లోనే ఓడించిన దివ్య దేశ్‌ముఖ్.. మరి ఫైనల్లో ఏం చేస్తుందో చూడాలి.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )